విషయము - జ్యోతిష్యము [illegible] సంపుటము - 2
సంచిక - 12

శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨.] రాజమహేంద్రవరము: విజయ సంవత్సర జ్యేష్ఠమాసము. [సంచిక ౧౨.

నీతి కథలు.

గ్రద్ద, నక్క.

గ్రద్దయొకటి యొకచెట్టు కొమ్మకొమ్మన గూడుకట్టి పిల్లలను బెట్టి వానిమేఁతకయి యేదైన జంతువు దొరకునాయని క్రిందఁ జూచుచుండఁగా, దూరమున నెండలో చలికాచుకొనుచు నొక నక్కపిల్ల దానికంటఁబడెను. కంటఁబడుటయే తడవుగా గృధ్రము బాణవేగమున క్రిందికి దిగివచ్చి, మృత్యుదేవతవలె జంబుకశిశువును కాళ్ళతో తన్నుకొని పయి కెగిరిపోవుచుండఁగా, ఇంతలో దానితల్లి వచ్చి కన్నుల నీరుపెట్టుకొని తనబిడ్డ ప్రాణము రక్షింప వలసినదనియు, తా నేకపుత్త్రశోకమును సహింపఁజాలననియు, బహువిధములగు దీనాలాపములు పలికి గృధ్రమును వేఁడుకొనెను. గ్రద్ద తనగూడు చెట్టుచిట్టచివర నున్నందున నక్క కందదనియు, వేఱువిధముగా పగతీర్చుకొనుట దానికి సాధ్యముకాదనియు, తలఁచి దాని మొఱ్ఱ యాలింపక యనాదరముచేసి యానక్కపిల్లను దనపిల్లల పొట్టను బెట్టుటకయి తిన్నగా తనగూటిలోనికిఁ దీసికొనిపోయెను. అందుమీఁద నక్క మిక్కిలికోపముతో పరుగెత్తుకొనిపోయి యాసమీపమున బాటసారులు కొందఱు యొకవృక్షముక్రింద వంట చేసికొనుచుండఁగా పొయిలోని భగభగమండుచున్న కొఱకంచొకటి నోరఁ గఱచుకొనివచ్చి పగసాధింపవలెనన్న యుద్దేశముతో గ్రద్ద గూడుపెట్టిన చెట్టుమీఁది కెగఁబ్రాఁకుచుండెను. మండుచున్న కొఱవితోవచ్చి నక్క మొట్టమొదటి కొమ్మమీఁదికి దుముకఁగానే యగ్నిజ్వాలలచేత తనకును తనకుటుంబమునకును అకాలప్రళయము వచ్చునని భయపడి గ్రద్ద మంచిమాటలు చెప్పి బ్రతిమాలుకొని యప్పుడే నక్కపిల్లను నక్కకిచ్చి పంపివేసెను.

గీ॥ పరులకును బాధగలిగించు వారలకును
నేఁడొ మఱునాఁడొ యెప్పుడో కీడుమూడు;

క్షితిఁ బ్రజాపీడకులు సురక్షితులమంచుఁ
బొంగుచున్నను దప్పక పొసఁగుఁ జేటు.

నూతిలోఁబడ్డ నక్క.

నక్కయొకటి ప్రమాదవశమున నూతిలోఁబడి గోళ్లతో నూతియంచు పట్టుకొని పయికిఁజూచుచు నీటిమీఁద తేలియుండెను. ఇట్లుండఁగాఁ గొంతసేపటికక్కడ కొకతోడేలు వచ్చి పయినుండి నూతిలో తొంగిచూచెను. తోడేలును జూచి నక్క సంతోషించి "ఓమిత్రుఁడా! నాపాలిటి భాగ్యదేవత సమయమునకు నిన్నిక్కడకుఁ బంపినది. నీవు వెంటనే యొకత్రాడు నూతిలోవేసి నన్నుఁ బయికీడ్చి నాప్రాణమురక్షించి పుణ్యము కట్టుకొమ్ము" అని దీనముగా వేఁడుకొనెను. నక్కకు సంభవించిన ఘోరవిపత్తునకు జాలిపడి తోడేలు "ఓమిత్రుఁడా! నీకు సంభవించిన యీయాపద నాకు వచ్చినట్లు పరితపించుచున్నాను. బుద్ధిమంతుఁడవైన నీకిట్టి విపత్తెట్లు సంప్రాప్తమయినది?" అని యడిగెను. "మిత్రుఁడా! నీకు నిజముగా నామీఁద ప్రేమయున్నపక్షమున జాలిపడుచు నిలుచుండక శీఘ్రముగా సాయము చేయుము. నేను నీటిలోమునిఁగి చావఁబోవుచున్నప్పుడు జాలిచూపెడు పొడిమాటలవలన నాహృదయమున కూఱట కలుగఁబోదు" అని నక్క పలికెను.


గీ॥ కరుణగల మిత్రుఁడైనది కానిదియును
గష్టకాలంబునందె నమ్మఁ గానవచ్చుఁ;
గష్టవేళఁ బిల్వకవత్తు రిష్టసఖులు
పిలిచినను గాని రాకుంద్రు కలిమివేళ.

గొఱ్ఱెతోలు కప్పుకొన్న తోడేలు.

ఒకతోడేలు గొఱ్ఱెతోలు కప్పుకొనివచ్చి గొఱ్ఱెలమందలోఁ బ్రవేశించి యజమానుని కనుమానము కలుగకుండ రాత్రివేళ నొక్కొక్క గొఱ్ఱెనే చంపి భక్షింప మొదలుపెట్టెను. ఈప్రకారముగాఁ గొన్నిదినములు జరిగినతరువాత గొల్లవాఁడామోసమును కనిపెట్టి, గొఱ్ఱెవేషము వేసికొనియున్న యాతోడేలుమెడ కొకత్రాడు బిగించి, చేరువనున్న చెట్టుకొమ్మకు దానిని వ్రేలాడఁగట్టెను. అదంతచూచి యట్టుపట్లు పొలములలోనున్న గొల్లవాం డ్రక్కడకువచ్చి గొఱ్ఱె నేలయురితీయుచున్నావని యడిగిరి. "ఇది గొఱ్ఱెవేషము వేసిన తోడేలుగాని నిజమయిన గొఱ్ఱె

కాదు. ఏవేషములోనున్నను తోడేలును పట్టుకొన్నప్పుడెల్లను నేనీలాగుననే యురితీసెదను." అని చెప్పి పయినిగప్పుకొన్న చర్మము తొలఁగించిచూపి వారిభ్రమ నివారణముచేసెను. అప్పుడు వారందఱును మాయవేషము వేసినందుకు కిది తగిన శిక్షయని సంతోషించి వెడలిపోయిరి.

సీ॥ కపటవేషంబు వలనను గలుగువాసి
వసుధ నిజము బయల్పడునవఱకె నిలుచు;
కల్ల తెలిసినపిమ్మట నెల్లజనులు
మోసగానిని ద్వేషింతు రిసుమంతని.



ఒంటికంటిజింక.

ఒక జింకకు దైవికముగా కన్నొకటిపోయెను. అది యందుచేత మేఁతకగు ప్రతిదినమును సముద్రపుదరికిఁ బోయి నీటివైపుననుండి యేమియు నపాయము రాదనుకొని గ్రుడ్డికన్నువైపునకును వేఁటగాండ్రను కుక్కలను దూరమునుండి చూడఁగానే పాఱిపోవచ్చునని మంచికన్ను నేలవైపునకును బెట్టి మేఁత మేయుచుండును. ఇట్లు జరుగుచుండఁగా నొకనాఁడు ఇద్దఱు వేఁటకాండ్రు చిన్నపడవ నెక్కి దానికిఁ గనఁబడకుండ సముద్రముమీఁద మిక్కిలి చేరువకు వచ్చి గుఱిచూచి

దానిని తుపాకితోఁ గొట్టిరి. గుండుదెబ్బ తగిలి చచ్చునప్పు డది "అపాయము వచ్చు ననుకొన్న నేలపైనుండి నా కేయపాయమును లేకపోయినది. అపాయము లేక సురక్షితముగా నుందుననుకొన్న నీటిపైనుండియే నాకిప్పుడు ప్రాణాపాయము సంభవించినది. ప్రాణమునందలి యత్యాశ చేత నేను నిష్కారణముగా నదివిడిచి సముద్రమునకు వచ్చి యీవిపత్తు దెచ్చుకొన్నాను" అని పరితపించుచు ప్రాణములు విడిచెను.

గీ॥ ఒకటి దాఁ దలంపఁగ దైవ మొకటి తలఁచుఁ
గావునను మానవుండు తా జీవనంబు
కొఱకె యెపుడు నత్యాశఁ గైకొనక ధర్మ
చింత చేయవలయు భగవంతు నమ్మి.

తోడేళ్ళు, గొఱ్ఱెలు.

తోడేళ్లకును గొఱ్ఱెలకును దీర్ఘకాలము ఘోరయుద్ధము జరగినతరువాత నుభయపక్షములవారును విసిగిపోయి సమాధానపడి యింతటినుండి పోరుమాని సుఖముగా బ్రతుకవలెనని నిశ్చయము చేసికొనిరి. గొఱ్ఱెలు తమ కావలికుక్కలను విడిచిపెట్టునట్లును, సంధి యేర్పాటులను పూర్ణముగా చెల్లించువఱకును నమ్మకము కలుగుటకయి తోడేళ్ళు తమపిల్లలను గొఱ్ఱెలవద్ద పూటపెట్టునట్లును, ఒప్పుకొందు మని తోడేళ్ళు రాయబారులను బంపఁగా గొఱ్ఱెలాయొడంబడిక నొప్పుకొని తమ కావలికుక్కలను బంపివేసెను. సంధిపద్ధతుల ననుసరించి తోడేళ్ళు తమపిల్లలను గొఱ్ఱెలయొద్దకుఁ బంపఁగానే యవి తల్లులు దగ్గఱ లేకపోవుటచేత నేడువ మొదలు పెట్టెను. అది సందు చేసికొని తామిల్లడగా నప్పగించిన తమబిడ్డలను గొఱ్ఱెలు తిన్నగా చూడక యేడిపించినందున సంధి చెడిపోయినదని నెపపెట్టి తోడేళ్ళు గొఱ్ఱెలమీఁద దాడివెడలి, కావలికుక్కలు లేకపోవుటచేత నసహాయము లయియున్న వానిపయినిబడి వానినన్నిటిని చంపి భక్షించెను.

గీ॥ తెలివిగలవారు దుష్టులపలుకు నమ్మి
యొక్కయప్పుడు నేమఱి యుండఁదగదు;
ఆత్మరక్షణ మేమఱి యహితులాడు
తేనెమాటలు పాటింప హానివచ్చు.

ప్రభావతీప్రద్యుమ్నము, పంచమాశ్వాసము. (౫౧౦-పుట శేషము.)

మ॥ పలికిన సంతసిల్లి హరిపట్టి గదాదులనార్వురన్ వధూ
నిలయములోని కావలికి నిల్పి రయంబున నొక్కరుండెదుఁ దా
వెలువడి కోటకుంగ బలవేష్టనము న్విడిపించుచున్ నిర
ర్గళగతిఁ జొట్టునుందిరిగె ఖడ్గవిహారపటుత్వదీప్తుఁడై. ౧౯౭.

ఉ॥ కాంచనదీప్తిచేఁ బసిఁడిగట్టు తెలుంగు నగళ్ళకోట సూ
చించఁగఁ దాను భాస్కరుని చెన్ను వహించెను దానిఁజుట్టి రా
సంచరణంబొనర్చు మను శౌరితనూజుఁడు కోటచుట్టు నడ్
డించిన దైత్యసైన్యము వడింద తమమ్మువలె విచ్చిపాఱఁగన్. ౧౯౮.

క॥ లగ్గలకు నట్టికోటకు
దగ్గఱుతన మొనలనెల్లఁ దఱిమితఱిమి పే
రగ్గలిక చూపుమరుపో
టుగ్గింపును వజ్రనాభుఁ డతని నెదిర్చెన్. ౧౯౯.

వ॥ ఎదిర్చి యిట్లనియె. ౨౦౦.

ఉ॥ ఎవ్వఁడవీవు నాపుడల యించుకలేక చొరంగరాదు నీ
కెవ్వరికైన బ్రహ్మవరమిట్టిది యేగతిఁజొచ్చితీవు తా
నివ్విధి నాకుఁ గల్లవరమిచ్చిన బ్రహ్మకు శిక్షచేసెదన్
గ్రొవ్వడఁగించి నిన్నిపుడ కొట్టెద నీకులమెల్ల రూపఱన్. ౨౦౧.

వ॥ అనుటయు నతండు. ౨౦౨.

క॥ నిను నేఁడు శిక్షిగి చనని
చ్చినఁగద బ్రహ్మకును శిక్ష సేయుదు వీడు
ర్జనతవె కావేమియుఁ జెతి
చినవి యనసత్యోక్తి బ్రహ్మజిహ్వకుఁ గలదే. ౨౦౩.

క॥ మొదలను బురిఁజొచ్చితి నీ
మదలన భద్రనటవేషమున హరిసుతుఁడన్
యదుకులజుఁడఁ బ్రద్యుమ్నుఁడ
మదిచ్చఁ గైకొంటి నీకొమారిత పొందున్. ౨౦౪.

ఉ॥ కోరికఁ దానవానుజుని కూఁతులకుం బతులైనవారు మా
వారలె నాకు వారికి నవార్యబలు ల్సహజాత యౌవనో
దారులుగల్గి రాత్మజులు తల్లులరక్షకు నున్నవారు ప్రా
కారములోన నీదారల గర్భ్యులఁ బల్వురఁ దిన్న మృత్యువుల్. ౨౦౫.

సీ॥ హరికి దేవేంద్రునకు నీవు శరణుచొచ్చి
తేని నీప్రాణముల కెందు కేను దగను
శరణుచొరవేని నా వాలుకఱకుగొఱ
యొఱఁగినదికాదు నీవది యొఱఁగెదిపుడు. ౨౦౬.

గీ॥ అనినవిని యోరి నీవేమియనినఁ జెల్లు
నేను నాదృష్టియొకటి నిన్నింతతడవు
పెట్టుకొనియుండుటకు నని బెట్టిదంపు
టంపవానలు గురిసె భయంకరముగ. ౨౦౭.

క॥ తనవాలునఁ దచ్ఛరములు
దునుముచుఁ బ్రద్యుమ్నుఁ డతని దునుమఁగడంకన్
ఘనరయమునఁ జనఁ దాఁకిరి
సునాభముఖ్యులగు రాక్షసులు బలములతోన్. ౨౦౮.

క॥ అదియంతయుఁ గనిమనముల
గదసాంబులు గినిసి కోటగవనులు బెలుకిం
చి దురాధర్షాటోపత
నెదిర్చిరి సునాభముఖుల నింద్రాహితులన్. ౨౦౯.

శా॥ అంతం గేశవుఁ డంచవేగిరులచే నాదైత్య సంగ్రామ వృ
త్తాంతంబున్విని తార్క్ష్యవాహనుఁడు చక్రాద్యాయుధ ప్రోల్లస
త్కాంతి క్రాంతదిగంతరుండయి వడిన్ దావచ్చె నచ్చోటికిన్
సంతోషంబున వజ్రి సత్వరగతి స్సంధించి సేవింపఁగాన్. ౨౧౦.

వ॥ అప్పు డింద్రుండు ధనురాది సకలహేతి సమేతంబును మాతలి సారథికంబును నైన తన దివ్యరథంబు ప్రద్యుమ్నునకు ననిచి గదసాంబులకు ననన్య దుర్జయంబులైన దివ్య స్యందనంబులఁ బనిచె దాన నపూర్వోత్సాహంబునం బొదలి యయ్యదుకుమారులు ప్రతిభటుల మించంజాలక సత్వరంబునఁ బోరుచుండి రయ్యవసరంబునఁ గృష్ణుండు. ౨౧౧.

క॥ సాహసము నాహత ప్ర
త్యూహతనైపుణము నొక్క యంతగ సుతుతో
సాహవ మొనరించు మహో
త్సాహనిధి వజ్రనాభదైత్యుని జూచెన్. ౨౧౨.

గీ॥ చూచియుల్లైన నెన్నండు సులభమగును
విజయమని మరుచేతికి జిక్కుఁదనిచేఁ
దనదుచక్రము నతఁడును దత్ప్రియోగ
మునను ఖండించె వజ్రనాభునిశిరంబు. ౨౧౩.

క॥ గదసాంబులు తద్విజయా
భ్యుదయముఁ గని పొంగి బహువిధోగ్రాస్త్రములన్
జిదురుపలుగ నానరించిరి
కదిసె సునాభాది దనుజగణదేహంబుల్. ౨౧౪.

వ॥ అప్పుడు. ౨౧౫.

శా॥ మందారద్రుమ పుష్పవృష్టి తతులున్ మంద్రస్ఫురద్దేవతా
దుందుభ్యారవ సంప్రవర్తనలు నస్తోకాప్సరో నర్తనా
మందోల్లాసము దివ్యగాయకుల సన్మాధుర్యగానంబు సా
నందోత్సేకము నిచ్చె లోకులకు నింటింటజాల దీపించుచున్. ౨౧౬.

వ॥ అంత నచ్యుతుం డనాథత్వ దైన్యదశాపన్నులగు పౌరజనుల ననేకవిధ లాలనా
చాతుర్య శీతలవచనామృతంబున నపగతాశేష శోకపరితాపుల నపూర్వ సంభృ
తానంద విశేషులఁ గావించి వజ్రనాభుని రాజ్యంబు సర్వంబును జతుర్భాగంబులుగా
విభజించి తదాధిపత్యంబునకుఁ బ్రభావంతుని జంద్రప్రభుని గుణవంతుని గీర్తిమం
తునిం బట్టాభిషిక్తులం గావించి కొమరులం గోడండ్రనుం దమ్ముని మఱఁదలిని
నత్యంతవిభవంబు మెఱయం దోడ్కొనుచు ద్వారకానగరంబునకు నరుగుదెంచి
దేవేంద్రునిం దదీయ స్థానంబున కనిచి సకలసామ్రాజ్య విభవంబు లనుభవింపుచు
నిరంతర కరుణావలోకనంబుల భక్తజనంబుల నవలోకింపుచు మహానందంబునం
బొలుపొందుచుండె నప్పుడు. ౨౧౭.

క॥ వావిరిఁ బ్రద్యుమ్నుండు ప్ర
భావతితో నిష్టకేళి పరిపూర్ణత నిం
పావహిలఁగ వర్తిల్లెను
శ్రీవరుఁ డమతంద్రిఁ దగభజించుచు ఘనుఁడై. ౨౧౮.

గీ॥ అఘహరణ హరివంశ కథాశ్రయంబు
నాత్మపుత్ర గుణస్తవ నాంకితంబు
నైన యీకావ్యమునకు మహాప్రసిద్ధి
యిచ్చుఁగాతఁ గరుణ లక్ష్మీశ్వరుండు. ౨౧౯.

శా॥ శ్రీ రాజేంద్ర గురూత్తమాన్వయ జనుర్విఖ్యాత సౌభాగ్య సో
మారాధ్య ప్రభు సత్కృపావశతర మత్యానీతశాఖాతతి భ
క్త్యార్థవ్యపగూహనాతి సుఖితాత్మాప్తమహాశాంతి స
ద్వైరాగ్యోదయ బోధముఖ్య బహుసంతానప్రసిద్ధుండిలన్. ౨౨౦.

క॥ వరచామర మిషవృత ది
క్కరటి శ్రుతకీర్తి సామ్యకావ్యత్కృతిగో
చరితాఖిల విద్వత్కుం
జరకర్ణుఁడు కర్ణుఁడిగి చాతుర్యమునన్. ౨౨౧.

వనమయూరము॥ భృత్యజనపోషణుఁడు పింగళిపురాంకా
మాత్యకులభూషణుఁడు మార్దవమహీయ
స్కృత్యశుచిభాషణుఁడు సాధుజనతా సం
పత్యుదయపోషణుఁడు భవ్యకృపచేర్మిన్. ౨౨౨.

గద్య॥ ఇది నిఖిల సూరిలోకాంగీకార తరంగిత కవిత్వవైభవ పింగళి యమరనార్య
తనూభవ సౌజన్యజేయ సూరయనామధేయ ప్రణీతంబయిన ప్రభావతీ
ప్రద్యుమ్నంబను మహాప్రబంధంబునందుఁ బరిపూర్ణ
భావభాసురంబయిన పంచమాశ్వాసము.

జయద్రథనాటకము. (౫౩౭ - పుటశేషము.)

కల—అయ్యయ్యో! నేనెరిగియున్నదియు చూచియున్నదియు చెప్పుట నాకెంతయు గౌరవహీనమైనపని. సర్వము తమరు కనుగొనగలరు. వారిని వెంబడించి వారి నడవడినింక కనిపెట్టుడు.

సూత్ర—ఇట్టివాని గొప్పవానిగా నమ్ముటవలన నిజముగా మోసపోతిమి. (నిష్క్రమించుచున్నాడు.)

రంగము—కోటలోనిగది.

[జయద్రథుడును దుర్గుణుయు ప్రవేశించుచున్నారు.]

జయద్ర—నీవేమియు చూచిరెరుగవా?

దుర్గు—అంతేకాదు. వినియుండనైనను లేదు. అనుమానమైన పడలేదు.

జయద్ర—ఆమెను, జయంతునిని నీ వొక్కకడ చూచియుంటినంటివి కాదా?

దుర్గు—ఒక్కకడ నుండిననేమి? అప్పుడు వారు మాటాడిన మాటలనే బాగుగా వినియుంటిని.

జయద్ర—ఏమి? వారొక్కమారైన రహస్యము చెప్పుకొనలేదా?

దుర్గు—లేదు మహాప్రభూ!

జయద్ర—నిన్నావలకైన పంపలేదా?

దుర్గు—ఎప్పుడును లేదు.

జయద్ర— విసనకఱ్ఱ తెచ్చుటకైనను మరియేవస్తువు తెచ్చుటకయిన నీవవతలకుఁ బోనైనలేదా?

దుర్గు—ఎప్పుడును లేదు.

జయద్ర.—ఇది నిశ్చయముగా నాశ్చర్యము.

దుర్గు—ఉ॥ ఆమె పతివ్రతాగుణము లామెసుభక్తియు సత్యయుక్తి లెం
చేమెయి తప్పుమంచునిదె యేనానరింతు ప్రమాణకోటులన్,
నీమముతోడ నగ్నిచొరనేర్తును పాములనైన బట్టెదన్!
మీమది నిట్టియూహల నమేలము జేయకు డో మహాప్రభూ!

సీ॥ ఎవడేనిదుర్మార్గుఁ డీరీతి యాలోచనల జెప్పి తమమది కలతనొంద
జేసియుండిననింక బేరనీయకుఁ డట్టి పాపపుటూహల భూపవర్య
యామెశీలమునందు నామెసద్గుణముల నామెపాతివ్రత్య నీమములను
దోషముల్ గలిగిన దోయజాసను సృష్టి లలనలలోపల గలదెయోగ్య

గీ॥ లిట్టియూహల నిక మూలమట్టుపఱచి
సతిని గుణవతి సతిరూపవతిని బుద్ధి

ననఘచారిణియని నమ్మి యనతిసౌఖ్య
ములను గైకొనగదవయ్య పురుషవర్య!

జయ—నీవుపోయి గుణవతి నిటురమ్మని చెప్పుము. (దుర్గుణ నిష్క్రమించుచున్నది.) ఈదుర్గుణ చాలదూరము చెప్పుచున్నది. అయిన నింతమాత్రము బొంకలేని దేపాటిజాణ. ఈదుర్గుణ జాణకు నిజముగా శిరోభూషణము. అయిన ప్రమాణములు జేయ సాహసించుచున్నదే!

[గుణవతియు దుర్గుణయు ప్రవేశించుచున్నారు.]

గుణ—నాథా! ఏమి సెలవు?

జయద్ర—ఇటురమ్ము.

గుణ—ఏలపిలిపించిరి?

జయద్ర—నాముఖమువైపు తేరిపారజూడుము.

గుణ—ఇది యొక్కటి చిత్రము!

జయద్ర—దుర్గుణా! నీమామూలుపని! తలుపుమూసి నీవావల కావలియుండుము. ఎవరైన వచ్చిరేని నెమ్మదిగా దగ్గిగాని తుమ్మిగాని హెచ్చరింపుము. త్వరితముగా పదము. [దుర్గుణ నిష్క్రమించును.]

గుణ—తమమాటలలో నొకవిధమైన కోపము కనుపించుచున్నది. మాటలుమాత్రము నాకర్థములగుటలేదు. ఏమి మీయభిప్రాయము?

జయద్ర—నీవెవరో నీవెరుగుదువా?

గుణ—నేను తమయెడల ప్రేమయు భయమును భక్తియుగల తమ భార్యను.

జయద్ర—రమ్ము. ఇటురమ్ము. ఆమాట ప్రమాణపూర్వకముగా చెప్పుము. లేనిచో యిల జీవకన్యకలబోలజాలు నిన్ను యమదూతలైన నంటవెరతురు.

గుణ—ఆసంగతి దైవమేయెరుగును.

జయద్ర—దైవమే నీయందుగల దుర్గుణముల నెరుగును.

గుణ—ఏమిదుర్గుణములు? దుర్గుణములా? ఏమిటినాథా?

జయద్ర—ప్రియసఖీ! పొమ్ము. పొమ్ము.

గుణ—నాథా! ఏమి దుర్దినము. కంట తడిపెట్టెదవేల? ఈకన్నీటికి కారణమేను గానుగద. నాతండ్రి ప్రోత్సాహంబున మీరిట్లు వెనుకకు పిలవబడితిరని యనుమానముగలచో నీయావేరము నాపై మోపకుడు. మీరాయన స్నేహము నెడబాసితిరి గాని నేనాయన నెడ బాసితిని.

జయద్ర—సీ॥ దుర్భరదుఃఖాబ్ధి తుదగాన లేకున్న కష్టనష్టములపాల బడిన రైన
నిరుపేదతనమంచు నెరి కృశించుచునున్న రోగజాలములబల్ రోతనున్న

శత్రుజాలంబులచే కట్టబడినను సంగర స్థలములఁ జెడియుచున్న
ఏకదసాఖ్యంబుచే కూరుకొందంత నేకదదిక్కు నాకెల్ల రొదల
సీ॥ ననుచునమ్మిక నైనయుంటి నట్టిదిక్కు
కూలద్రోయఁగ దలచితే క్రూరబుద్ధి
నకట! దైవమ! యేమందునహహ! యిట్టి
కటికెదినములఁ జూడఁగఁ గల్గెనాకు.

గుణ— నానాథులు నన్ను పతివ్రతగా నమ్మెదరని మాత్ర మూహించెదను.

జయద్ర— పాపము! పరపురుషవీక్షణము దొరకనంత సేపు. ఓగుణవతీ! రూపవతీ! మనోనాయకీ! నీగుణము లెల్ల నీవొనర్చిన పని తలచినంతమాత్రమున నాశనము లగుచున్నవిగదా!— నీవు పుట్టకున్న నెంతబాగుగానుండును.

గుణ— కటకటా! నేనేమి పాపమాచరించితిని?

జయద్ర— సౌందర్యనిలయంబన జాలు నీలలాటఫలకంబుకట్టు జారిణియని వ్రాయ పుట్టింపబడియెనే! ఏమిచేసితివి! ఏమి చేయవలెను! రంకులాడీ! నీవొనర్చిన పనులు చెప్పుటకే సిగ్గుచేత మనుజుడు మటుమాయమగును. ఏమి చేయవలెను! నీకర్జంబులు దలచినంత గురుభార్యాద్రోహియైన చంద్రుండును, సర్వవస్తుసంపర్కముగల వాయుదేవుండును గూడ జడియుచుందురు. ఇంకనేమి చేయవలెను? పరమజారిణీ!

గుణ— దైవసాక్షిగా తమరు నాయందన్యాయముగా నేరమారోపించుచున్నారు.

జయద్ర— నీవు రంకులాడివి కావా?

గుణ— కాను; నేను దైవభక్తిగలదాననగుటచే తమయందు భక్తిగలిగి యీదేహము తమకొరకు కాపాడుచున్నాను.

జయద్ర— జారిణివైన కావా?

గుణ— గురుభక్తిగలదాననగుటచే నేనట్టిదానను కాను.

జయద్ర— ఏమి! ఆశ్చర్యము.

గుణ— దైవము మనలను రక్షించుగాక!

జయద్ర— అట్లైన నేనాడినమాటలకు నన్ను క్షమియింపుము. చిత్రమునకు జయద్రథు పాణిగ్రహణము చేసిన కాశ్మీరదేశపు నెరజాణవనుకొంటిని. యమలోక ద్వారమున కాపాడుటకు తగినదానవనుకొనుచుంటిని.

[దుర్గుణ ప్రవేశించుచు.]

అయ్యో! అయ్యో! అయ్యో!

మామాటలైనవి. ఇదిగో నీకష్టమునకు ప్రతిఫలము. ఇక తలుపు మూసిపెట్టుము.

దుర్గుణ—అయ్యో! ఈయన యభిప్రాయమేమి? అమ్మా ఎట్లుంటిరి? ఎట్లుంటిరి?

గుణ—సగము నిద్రలోనుంటిని.

దుర్గుణ—అమ్మా! మాప్రభువులకు కోపకారణమేమి?

గుణ—ఎవరికి?

దుర్గుణ—నాప్రభువునకు.

గుణ—నీప్రభు వెవ్వరు?

దుర్గుణ—అమ్మా! తమవారైన మాప్రభువులకు మీనాథులకు.

గుణ—నాకట్టివారెవ్వరును లేరు. నీవు నాతోడ మాటాడవద్దు; కన్నీటివెల్లువ లోడ్చుటతప్ప రేయచ్చుటకుగాని నీమాటలకు త్తరము లొసగుటకుగాని నాకు శక్తిలేదు. నేటిరాత్రి ధరించుటకు నామధుపర్కంబుల సిద్ధముగానుంచుము. నీ భర్తనొకమారిటు రమ్మని చెప్పుము.

దుర్గుణ—నిజముగా నాకిది చిత్రముగానున్నది. [నిష్క్రమించును.]

గుణ—నాకు తగినట్లయినది. ఇట్లు కావలసినదే. ఎంతవిధేయతగా సంచరించుచున్న నిట్టియనుమానములు పుట్టుచున్నపుడింక మెలగుట యెట్లు?

[దుర్గుణ కలహప్రియుడును ప్రవేశించెదరు.]

కల—అమ్మా! ఏమి సెలవు? నన్నేలపిలిపించిరి?

గుణ—నేను చెప్పజాలను.

కల—ఏమమ్మా! అట్లు సెలవిచ్చుచున్నారు?

దుర్గు—అయ్యో నాథా!—నేడు మాయమ్మగారు తమభర్తగారిచేత పడరాని మాటలు పడియున్నారు.

గుణ—నేనట్టి మాటలుపడుటకు తగినదాననా? కలహప్రియా!

కల—ఎట్టిమాటలమ్మా?

గుణ—నేనట్టిమాటలు పడితినని దుర్గుణ చెప్పెనో యట్టిమాటలే.

దుర్గు—ఆమెను పరమజారిణియని పిలిచినారు. ఎంగిలియాకులు నాకి బ్రతుకు నీచడైన తన భార్యనిట్లు పిలుచునా?

గుణ—నాకు తెలియదు. నేనుమాత్ర మట్టిదాననుకాను.

కల—విచారించకుడమ్మా విచారించకుడు. అదియాదినమహాత్మ్యము.

దుర్గు—ఎట్టి వరులనైన నొల్లక, దేశమును తండ్రిని, బంధువులను విడనాడి యుట కరుదెంచుట యిట్టి మాటలుపడుటకా? ఒక్కయేడుపైన యేడువవద్దా?

గుణ—అదియు నాదురదృష్టమే.

కల—ఆయనకంత కోపమేల రావలయును?

గుణ—ఆసంగతి దైవముతప్ప మరియెవ్వరెఱుంగరు.

దుర్గ—ఎవడో పరాపకారపారీణుడైన మానవాధముండెద్దియో కార్యార్థియై యిట్టియనుమానకల్పనమాచరించి యుండుననుటకు సందేహము లేదు.

కల—ఛీ! అట్టివారెవరుగలరు?

గుణ—అట్టివారలోకచో నున్నవారిని దైవము కాపాడుగాక!

దుర్గ—వానిప్రాణము చాలసేపువరకునురిత్రాడు కాపాడుగాక! వాని శరీరము నక్కలపాలగుదాక నగ్ని కాపాడుగాక! 'లంజ'యనిపించుటకు కారణమేమి? ఆమెస్నేహమెవరుచేసిరి? ఎప్పుడుచేసిరి? ఎక్కడచేసిరి? ఏవిధముగాచేసిరి? లేదు! లేదు! ఎవడో దుర్మార్గుడు! కుచ్ఛితుడు! నిర్భాగ్యుడు! జయద్రథునిమనస్సును కలతలబెట్టెననుటకు సందేహము లేదు. ఓ దేవుడా! లోకమందుగల సజ్జనులందరకు తలకొంచబుకు నొసగి యిట్టి కుజనుల దిగంబరులుగా దిగంతములు చేరు వనుక శిక్షితులగుచు పారదోలబడునట్లనుగ్రహింపుమా.

కల—నెమ్మదిగా మాటాడుము.

దుర్గ—ఇప్పుడు నెమ్మదిరాదు. అట్టి దౌర్భాగ్యశిరోమణిమాట లాలించియే మీరు నాపైనపరాధము మోపినారు.

కల—నీవు బుద్ధిహీనురాలవు. ఈపాటి నోరుమూసికొమ్ము.

గుణ—కలహప్రియా! నాపతి కోపము చల్లారునంతటి భాగ్యము నాకెట్లు కలుగును? నాపై గరుణించి యాయనపాలికరుగుము. ఈపంచభూతములు సాక్షులుగా నాపయి నాయనకు కోపమునకు కారణము లేదని చెప్పెదను. మనోవాక్కాయ కర్మలయందు వారికెట్టి యపరాధముగాని నేనొనరించలేదని యెట్టి ఘోరప్రమాణమయిన చేసెదను. వారలకు నాపయి నెంతయాగ్రహము కలిగినను నన్నెట్లు నిర్బంధపరచినను వారిపయి నాకుగల ప్రేమమాత్రము తగ్గదు. వారియాగ్రహము నాప్రాణోపద్రవము కావచ్చునుగాని నాప్రేమమాత్రము మార్పజాలదు. ఱంకులాడియనుమాట నేనుచ్చరింపనైనజాలను. ఇప్పటియుచ్చరించితిని. అట్టియెడ నామెకై లోకమంత ధారవోసిన నేనట్టిపని చేయ సాహసింతునా?

కల—అమ్మా! శాంతిబొందుము. రాచకార్యవిషయమయిన కోప మాయన తమపై జూపినారుకాని వేరుకాదు.

గుణ—అదేనిజమగునా—

కల—నిశ్చయముగా నదే నిజము. (లోపల గంటవాగును.) చూడుడు. భోజన సమయమగునది. నేటిదినము సూక్ష్మబుద్ధి మొదలగువారు విందుకు దయచేసి యున్నారు. లోపలకేగుదము. విచారించకుడమ్మా! సర్వము నెమ్మదిపడగలదు.

[గుణవతి దుర్గుణ నిష్క్రమించుచున్నారు]

[కామపాలుడు ప్రవేశించుచున్నాడు.]

ఏమి కామపాలా!

కామ—నీవు నావిషయమయి న్యాయముగా ప్రవర్తించుచున్నావని నే నమ్మజాలను.

కల—ఎందువల్ల?

కామ—ప్రతిదినమును నాకేదియో యొకలాభ మొనర్చెదనని బూటకపుమాటలు చెప్పి మోసపుచ్చుచుంటివి. నాకిదివరకేసుమంత లాభమయిన జేయవైతివి. బుద్ధిహీనతచేత నేనిదివరకు మోసపోయిన నిక తెలివిగలిగి వర్తించెద.

కల—కామపాలా! నామాట లించుక చెవియొగ్గి వినుము.

కామ—నీమాటలు చాలగా వింటిని. నీమాటలకు చేష్టలకు సంబంధ మిదివరకగు పడలేదు.

కల—నీవు నాపై నిష్కారణము నేరమాపాదించుచున్నావు.

కామ—నేను నీపయి నన్యాయముగా నేరమూపాదించుట లేదు. నాసొమ్మంతయు వ్యర్థమయ్యెను. గుణవతికిచ్చుటకయి నీవు నాయొద్దకొంపోయిన నగలేచాలును. అనగ లామెచేకొనెననియు నన్నాదరించెదనని వాగ్దత్తమొనర్చెననియు చెప్పితివిగదా!

కల—సరే. ఆమాటలకేమి. చాలించుము.

కామ—చాలించనా? మంచిదే! నేచాలించను. నీవు నన్ను నిష్కారణముగా మోసపుచ్చితివనుటకు సంశయము లేదు.

కల—మంచిది.

కామ—మంచిదికాదనే చెప్పుచుంటిని. నేను నేపోయి గుణవతి నడిగెదను. ఆమె నా వస్త్రములు నాకొసంగిన నేనిదివర కొనరింపబూనిన యన్యాయమునకు పశ్చాత్తాపముతో మరల దేశంబున కేగెద. లేనిచో నాసొమ్ము నీవ యీయ వలసియుండును.

కల—నీవాగ్జాలముమాత్రము బాగుగా కుదిరినది.

కామ—నేను చేయదలచినదానినే చెప్పితిని.

కల— నేటికిఁగదా నీస్థైర్యస్థైర్యాదులు నాకుబోధపడ్డవి. ఇదివఱకు నీవిషయమయి నాకుగల యభిప్రాయములనిక మార్చెదను. మిత్రమా! నాపయి నీవుమోపిన నేరము కారణసహితమే యయియున్నను, నీవిషయమయి నేను పడుచున్న కష్టములు బాగుగ విచారించిన నాయుం దంతతప్పుండదని నీకతోచునుసుమా!

కామ— నీశ్రమ నాకిదివఱ కగుపడలేదు.

కల— నిశ్చయముగా కనుపడనేలేదు. ఆమాట సత్యమే కామపాలా! నీవింకొక్క కార్యముమాత్రము జేసితివేని నీమనోభీష్టసిద్ధి యగును. ఈరాత్రి నీధైర్యస్థైర్యములుచూపవలెను. రేపటిరాత్రి నీవు గుణవతిననుభవించకుండినచో నీయిష్టమువచ్చినశిక్షకు నేబద్ధుడ నయ్యెదను.

కామ— సరే యేమది? మానవులకు ప్రయత్నసాధ్యమయిన పనియేనా?

కల— జయద్రథుని పని మన జయంతునకొసగి జయద్రథుని వెనుకకు రమ్మని మహారాజుత్తరవొసగినారు. ఈవర్తమానము నేఁడువచ్చినది.

కామ— నిజమేనా? అయ్యో! ఇక గుణవతి భర్తతో వెనుకకు బోవునుగాబోలు.

కల— వెనుకకుబోవువారు యాత్రార్థము శ్రీరంగాది పుణ్యక్షేత్రములకు బోనయియున్నారు. ఇప్పుడు మనము జయంతు నాపని కసమర్థునిగానొనరించి వీరి నిచ్చట నాపవలయును.

కామ— ఆపని మనమెట్లు చేయగలము?

కల— ఆపనిరమెంత. జయంతుని తల పగులగొట్టి చంపినంతమాత్రన మనమాపని చేయవచ్చును.

కామ— ఆపని నన్నొనర్చుమనిగాబోలు నీయభిప్రాయము.

కల— నీకునీవు లాభ మాచరించుకొనదలచితివేని నీవట్లు చేయవలెను. నేటిదినమాత డొకరంకులాడి యింటికి విందునకై పోవును. ఆతడు మరల నిశిరాత్రి యింటికే తెంచునట్లు చేసెద. నీవాతరివేచి యాతనితల పగులగొట్టవలెను. నేను నీకు కుడిభుజముగా నుండి కాపాడుచుండెద. ఇట్టికార్యమునకు శూరాగ్రేసరుండవైన నీవును జడియనా. ఆతని చావువలన మనకు గలుగు లాభంబులన్నియు నీకెఱింగించెద రమ్ము. రాత్రియంత వ్యర్థముగా బోవుచున్నది. భోజనకాలము గూడ మించినది.

కామ— ఈపనికి తగినకారణములు మాత్రము ముందుచెప్పవలెనుసుమా!

కల— నీచిత్తమువచ్చినవి చెప్పెదను. రమ్ము.

[నిష్క్రమింతురు.]

రంగము:— కోటలోని మరియొకగది.

[జయద్రథుడు, సూక్ష్మబుద్ధి, గుణవతి, దుర్గ్గ, సేవకులు ప్రవేశించుచున్నారు.]

సూక్ష్మ—అయ్యా! తమరు శ్రమపడి యింక నడువకుడు. నాకు సెలవొసగుడు.

జయద్ర—దానికేమి నడచుటవలన దేహమునకు మేలగును.

సూక్ష్మ—అమ్మా! మీకు శుభమౌగాక! నాకింక సెలవొసగుడు.

గుణ—చిత్తము.

జయద్ర—అయ్యా! నడచెదరా? కాంతా—

గుణ—అయ్యా! ఏమిసెలవు?

జయద్ర—నేనిప్పుడె వచ్చెదను. నీవు గదిలోనికిపోయి నీసేవకురాండ్రకు సెలవొసగి పంపి సిద్ధముగానుండుము.

గుణ—చిత్తము.

[జయద్రథుడు, సూక్ష్మబుద్ధి సేవకులు నిష్క్రమించుచున్నారు.]

దుర్గ్గ—అమ్మా! ఏమి? ఈయన యింతలో శాంతమును ధరించినారు.

గుణ—తామిప్పుడె వచ్చెదమనియును, నీకు సెలవిచ్చిపంపి నన్నొంటరిగా గదిలో నుండుమనియు సెలవొసగినారు.

దుర్గ్గ—నాకు సెలవిచ్చి పంపుమన్నారా? ఆశ్చర్యము! ఆశ్చర్యము!

గుణ—అది వారియాజ్ఞ. ఇట్టిసమయమునసే నాయన మాటల కడుగుదాటను. నీవు శీఘ్రముగా నాకు రాత్రిధరించు దుస్తుల నొసగి యింటికి పొమ్ము.

దుర్గ్గ—నీకీయన యెట్లుదొరికెనమ్మా?

గుణ—ఆమాటకు నేనుమాత్రము సమ్మతించను. ఆయనకు నాపై నెంతకోపము వచ్చి యెంతకోపపడిన నాప్రేమ మరింత వృద్ధిపొందునుగాని తగ్గదు; నాదుస్తుల నిక్కడ విప్పుము. కోపముతోనున్నపుడాయనముఖమున కొకరీతి విలాసము చేకూరుసుమా!

దుర్గ్గ—తమసెలవుప్రకారము నేటిరాత్రికి మధుపర్కంబుల సిద్ధముగా నుంచితిని.

గుణ—ఏదైననొకటిరమే. నీవుబ్రతికియుండగా నాకు చావు సమకూరినచో నాకా బట్టు లప్పుడుకట్టుము.

దుర్గ్గ—మీమాటలకేమి. రండి. దుస్తులతొడిగెదను.

గుణ—మాతల్లిగారియొద్ద విలాసవతియను దాసియొకతె యుండియుండెను. ఆమె ప్రేమించినవరుడు పిచ్చివాడయి యామెను విడిచిపోయెను. ఆమె యదృష్టము సూచించు చిత్రమగు పాట నాకదానిని యామె నేర్పియుండెను; గాన దానిని

పాడుచు ప్రాణత్యాగ మాచరించె. నేటిరాత్రి ఆపాట నామనస్సులోనుండును. నేనావిలాసవతి పాడినట్లు పాడగలిగినను నామెవలె తల్ప్రేలచేసి నడువజాలను. త్వరితముగా ముగింపుము.

దుర్గ—నేనుపోయి మీరాత్రిధరించు దుస్తులు తెచ్చెదను.

గుణ—వద్దు. ఇక్కడనున్న దుస్తుల నేకట్టుము. ఈసూత్ర్మబుద్ధితగు మనుష్యుడనుమా!

దుర్గ—బహు రూపవంతుడు.

గుణ—చక్కగా మాటలాడనేర్చును.

దుర్గ—కాశ్మీరమునుండి రెయొకజాణ యీతని యాలింగన మపేక్షించి నాన్యాకుమార్యగ్రమువరకు కాలినడక బోవయత్నించెను.

గుణ—(పాడును) ద్విపద॥ హా పుష్పబాణ హాహానాథయనుచు

నాపూవుబోడి తా నరిపెతమున్గి
కన్నీటి బిందువుల్ కాల్వలై పార
క్రొన్ననబోలు నాచిన్నిహస్తమున
చెక్కిలిజేర్చి తా చింతించెనిటుల

ఇవిహారముగా నుంచుము.

పారలేని స్నేహంబు పొంగిపొర్లంగ
వరునితో గూడెడి భాగ్యంబుగలిగి
కాలము హాయిగా గడపితిగాని
యీవిల నింతలో నిన్నిభంగులను

అయనవచ్చువేళ యయినది. త్వరితముగా ముగింపుము.

పలు నాపదలలోన బడిరొద ననుచు
కలనైన నాబుద్ధి దలచలేనైతి

అదికాదు ముందు. విను! ఎవరాతలుపుతట్టునది?

దుర్గ—గాలిగాని మరియొకటి కాదు.

గుణ—(పాడుచు) కాలంబునను నీమకంటికి దైవమా!

వేలపు గింజయు బెద్దదైయుతోచె.

నీవింటికి పొమ్ము. కుడికన్నదరుచున్నది. ఏమి దురదృష్టము దాపైయున్నదో తెలియదు. ఏమికష్టములు సన్నిహితములై యున్నవో దుర్గణా!

దుర్గ—తమకు కష్టము లిక్కడగాని యొక్కడగాని లేవు.

గుణ—తెలివివచ్చినది! మగవారిని నమ్మరాదు! ముమ్మాటికి నమ్మరాదు!—దుర్గణా!

నిజముగా జెప్పుము. తమభర్తల మోసపుచ్చి పరపురుషులతో వ్యభిచరించు నట్టి కులాంగన లెచ్చటనైన కలరా?

దుర్గ—ఉండురనుటకు సందేహము లేదు.

గుణ—నీకీలోకమంత ధారవోసిన నట్టిపాడుపని చేయ సాహసించెదవా?

దుర్గ—తమరేల సాహసించరు?

గుణ—ఈ తేజోమయ స్వరూపుడగు నాదిత్యుండు సాక్షిగా నేనట్టిపని నెప్పుడు చేయను.

దుర్గ—సూర్యుడు సాక్షిగా నేను మాత్రము చేతునా? చేసిన రాత్రి జేతును.

గుణ—నీకీలోకమంతయు ధారగాబోసిన నీవట్టిపని జేసెదవా?

దుర్గ—ముఖ్యముగా జేసెదను. అంత స్వల్పదోషమున కింత ఘనవస్తుసంపాదన మగుచుండగా నేల చేయరాదు?

గుణ—నిజముగా నీవట్లు చేయువని నమ్మెదను.

దుర్గ—నిజముగా నంతలాభమున్నయెడల నట్టిపని చేసితీరెదనని నే నమ్ముచున్నాను. చేసి లేదని బొంకగలను. రంకుతప్పు బొంకు తీర్పగలదు. ఒక పూసల సూదికిగాని గచ్చకాయలకుగాని రవికెగుడ్డకుగాని యాశించిమాత్ర మట్టిపని చేయను. గొప్పలాభమున్న ముఖ్యముగా జేసెదను. ప్రస్తుతము లాభమున్న యెడల పిమ్మట యమలోకమునైన లక్ష్యపెట్టను. పతిని మోసపుచ్చియైన నాతని భాగ్యవంతునిగా జేయుట కావలె యిచ్ఛయింపదు?

గుణ—నాకీమూడులోకముల నిచ్చెదనన్న నేనట్టిపని జేయజాలనుసుమా!

దుర్గ—ఏమమ్మా! అప్పుడా తప్పు మీలోకములోనిదే యగునే. మీతప్పునకు మూడు లోకములు సంపాదించినప్పుడు మీలోకములోని తప్పుల మీరుసవరించుకొన లేదా? ఇంతమాత్రపు నేరముతో నేను నాపతిని చక్రవర్తిని చేయగలిగితేని—

గుణ—అట్టిస్త్రీ లీలోకమందు గలరని నమ్మజాలను.

దుర్గ—అట్టిస్త్రీ లనేకులు గలరు. వారి యనుగ్రహమువలననే భూభారము క్రమముగా వృద్ధినొందుచున్నయది. స్త్రీలతప్పులకు పురుషులే కారకులు. తమతమ నిర్ణయము లతిక్రమించుటకును గడించినధనమంతయు రంకుటాండ్రపాలొనరించుటకును, లేనిపోని జారశంక లవలంబించి భార్యలశిక్షించుటకును మగవారు సర్వస్వాతంత్ర్యులట! మనకు మాత్రము వారివలె కామాదులు లేవా! స్త్రీ లెంత దీనదశయందున్న నెద్దియో విధమున వారి పగవారును తీర్చుకొన సమర్థులె. తమ భార్యలకు తమవలెనే కండ్లును చెవులును కలవనియు, వారు నించుక సూచించ

గలగనీయ మాత్రము భర్త లెరిగియున్నచో నిట్టి యకృత్యములు రాకుండునుగదా! మనలను కాదని వారితరకాంతల గోరుచుంటకు కారణమేమి? ఇది యేమినవ్వులాటలా? ఆనవ్వులాటలు మనకు లేవా? కటకటా! పురుషు లొనరించు దుష్కార్యములు స్త్రీల దుర్మార్గ కృత్యములకు కారణములగుచున్నవి!

గుణ— రాత్రి ప్రొద్దుపోయినది. ఇంటికిపొమ్ము.

గీ॥ పురుషు లొనరించు దుష్కార్యములను స్త్రీల
దనరుచుండెడి దుష్ప్రవర్తనలు నాకు
క్రమముమీరగ నెపుడు సత్కార్యములను
లలిత వర్తనమును నేర్పగలుగు గాత!

[అందరును నిష్క్రమించుచున్నారు.]

జయద్రథనాటకము.

—:O:—

పంచమాంకము.

రంగము:— లక్షద్వీపము, ఒకవీథి.

[కలహప్రియుడును కామపాలుడును ప్రవేశించుచున్నారు.]

కల— ఈస్థలము చక్కగా కుదిరినది. ఈ గోడచాటున పొంచి కత్తి సిద్ధముగా నుండికొని, యాతడు కంటబడినంతనె యమపురికి దారిజూపుము. నేను నిన్ను కుడిభుజముగా కాపాడుచుండెద. బహుజాగ్రత. ధైర్య మవలంబించవలెను.

కామ— నాకుగల తొందర కార్యవిఘ్న మాచరించునేమో. నీవుమాత్రము నన్ను కనిపెట్టియుండుము.

కల— ఇక్కడ నిలిచెదను. ధైర్యస్థైర్యము లిట్టియెడ తప్పక జయమునీయగలవు.

(నిష్క్రమించి పొంచియుండును.)

కామ— ఈపనిచేయుటకు నాకెంతమాత్ర మిష్టము లేదు. కలహప్రియుడు తగినన్ని సబబులు చెప్పుటచేత సమ్మతించితిని. ఒకమనుష్యుడు చచ్చుటవలన లోకమున కేమి లోపమా? ఒరనుండి కత్తి తీసినంతమాత్రన నాతడు యమపురంబు చేరగలడు.

కల— ఈ కామపాలుడను దురదపాకును చక్కగా గోకితిని. మంట ప్రారంభమగుచున్నయది. ఇప్పుడు జయంతు డీతనిని జంపిన, లేక ఒకరినొకరు చంపి

కొనిన నాకులాభమే. కామపాలుడు జీవించియుండిన యెడల గుణవతి కిచ్చెద నని మోసము చేసి యాతనివలననే చేకొన్న నగలు మరల యొసగుమని బాధించకమానడు. గనుక నాతడు బ్రతుకగూడదు. ఇక జయంతుని రూప మిదివరకే నాకంటికి కంటకప్రాయముగదా! ఇక నిప్పుడాతడు జీవించి జయభద్రునితో మాటాడుట సంభవించిన నావని గోరుచుట్టుపై రోకటిపోటుబడ్డట్లగును. గాన నాతడు మాత్రము బ్రతుకగూడదు. అదె యాతడు వచ్చుచున్నాడు.

కామ—ఆనడకే జయంతుని దే— రాజద్రోహీ! నిన్ను చంపుచున్నాను.

(కత్తితో జయంతుని నరుకుచున్నాడు.)

జయం—నీకత్తిదెబ్బ నీవు యోచించినట్లు నాహస్తములు బలహీనములైయుండియుండిన నాకు విరోధియే యగును. నీహస్తములశక్తిగూడ పరీక్షించెదగాక! (కత్తి యొరనుండి పెరికి కామపాలునకు గాయము చేయుచున్నాడు.)

కామ—చచ్చుచున్నాను! చచ్చుచున్నాను!

[వెనుకనుండి కలహప్రియుడు జయంతుని కాలునరికి పారిపోవుచున్నాడు.]

జయం—నాకాలు విరిగినది. అయ్యో! రండి! రండి! హత్యజరుగుచున్నది.

[జయభద్రుడు ప్రవేశించుచున్నాడు.]

జయభ—ఇది జయంతుని కంఠస్వరమే! కలహప్రియుడు మాట నిలిపికొనినాడు.

కామ—నేనెంతద్రోహిని!

జయభ—నిశ్చయముగా ద్రోహివే!

జయం—రండు! రండు! కాగడలు తెండు! వైద్యుడు! వైద్యుడు!

జయభ — నిశ్చయముగా నాతడే. అదితప్పని కలహప్రియా! నీమిత్రునకు జరిగిన యపకారమునకు నీ వెంత శ్రమపడుచుంటివి. నీధైర్యమును న్యాయదృష్టియు నేనెట్లు పొగడగలను? నాకు మంచిపాఠము నేర్పితివి. రంకులాడీ! ఇదె నీ ప్రియుడు గతప్రాణుడయినాడు. నీకును కాలమాసన్నమయినది. ఇదే వచ్చుచున్నాను. ఇంక నీరూపరేఖా విలాసంబుల మనస్సుననుండి తొలంగించి యేశయ్యపై నీవు నా కపకార మొనరించితివో యాశయ్యయందె నీప్రాణములు చేకొనియెదగాక! (నిష్క్రమించును.)

[నీతిమంతుడును, సూక్ష్మబుద్ధియు ప్రవేశించుచున్నారు.]

జయం— ఏమికర్మము! ఇంత రాజవీధియం దొక్కరుగాని లేరా! కావలికాండ్రు భటులయినను లేరా! హత్య! హత్య! నరహత్య!

నీతి—ఏమి? ఈభయంకరమగు కేకలు! ఏమి! చిత్రము.

జయం—ఎవ్వరైన నించుక తోడ్పడుడు!

సూక్ష్మ—ఏమీ!

కామ—ఓ రాజద్రోహీ!

సూక్ష్మ—ఇద్దరుముగ్గురు కేకవేయుచున్నారు. ఎంతదుర్దినము. ఇది మమ్ము మోసపుచ్చుటకు చేయు కేకలయి యుండవచ్చును. తోడు లేక మనమాకడకే పోరాదు.

కామ—ఎవ్వరును రారా? నేనిట్లు రక్తము కారి చావవలసినదే!

సూక్ష్మ—ఏమీ!

[కలహప్రియుడు దీపము చేతబూని చిన్న చాక్కును తోడగి ప్రవేశించును.]

నీతి—ఇదే, ఎవడో యాయుధములను దీపమునుబూని వచ్చుచున్నాడు.

కల—ఎవరక్కడ? హత్యజరుగుచున్నదని యేడ్చువాడెవడు?

సూక్ష్మ—మాకు తెలియదు.

కల—మీకా యేడుపు వినిపించలేదా?

జయం—ఇక్కడ! ఇక్కడ! దైవమును చూచియైన నన్ను కాపాడుడు.

కల—ఏమిసంగతి?

నీతి—ఈతడు కలహప్రియుడని తలంచెద.

సూక్ష్మ—నిశ్చయముగా నాతడే. బహుధైర్యవంతుడుసుడీ!

కల—ఎవ రాయేడ్చువారు?

జయం—కలహప్రియా! నిష్కారణము ద్రోహులచే మోసపోతిని. గాయములతి మెండుగా తగిలినవి. త్వరితముగా రమ్ము.

కల—అయ్యో! సేనానాయకా! జయంతా! ఇంతపని నెవరొనర్చిరి?

జయం—వారలలో నొకడు పరుగెత్తలేక యీప్రక్కన పడియున్నాడు.

కల—ఎట్టి రాజద్రోహులున్నారు! ఎవరక్కడ? ఇటుదయచేసి యించుక సహాయము పడుడు. (నీతిమంత సూక్ష్మబుద్ధులతో)

కామ—నేనిచ్చట పడియున్నాను. నన్ను కాపాడుము.

జయం—అతడొకడు. చూడుము! చూడుము!

కల—ఓదుర్మార్గుడా! ద్రోహీ! (కామపాలుని పొడుచుచున్నాడు.)

కామ—ఓకుద్విజాధమా! కలహప్రియా! ఓనిర్దయహృదయా! ఓకిరాతకునకమా!

కల—చీకటిలో పొంచియుండి మనుష్యులను చంపుచున్నారు! తక్కినవారెక్కడనున్నారు? నిశిరాత్రియగుటచే కేకల నాక్కపెట్టరైన లేరు! హత్య! హత్య! ఎవరువారు? మీరు సేనాంగములలోనివారా? లేక మంచివారా?

సూక్ష్మ—నీవు బాగుగా యోచించిన మేము మంచివారమని నీకు తెలియగలదు.

కల—ప్రభువులయిన సూక్ష్మబుద్ధులా?

సూక్ష్మ—అతడేనండి.

కల—నన్ను తమరు క్షమించవలెను. జయంతుడు ద్రోహులచేత గాయములను మెండుగా తినియున్నాడు.

నీతి—ఏమీ! జయంతా!

కల—అన్నా జయంతా! గాయమెచ్చట తగిలినది?

జయం—కాలు రెండుతునుకలయినది.

కల—అయ్యో! దైవము కాపాడుగాక! ఒక్క దీపమమాత్రము తెప్పించుడు ప్రభువులారా! నాచొక్కాతోనైన కట్టిపెట్టెద నంతదనుక రక్త మోడుచున్నది.

[ప్రియంవద ప్రవేశించును.]

ప్రియం—ఏమిది? ఏమిది? అయ్యో! ఎవరా కేకలు వేయుచున్నారు?

కల—ఎవరువారు!

ప్రియం—అయ్యో! ప్రాణేశ్వరా! జయంతా! జయంతా! జయంతా! అయ్యో! అయ్యో!

కల—ఛీ! లంజా!—జయంతా నిన్నిట్లొనర్చినవా రెవ్వరో యూహించగలవా?

జయం—ఊహింపజాలను.

సూక్ష్మ—నేను మిమ్ము చూచుటకు బయలుదేరితిని. ఇట్లు చూచుటకు చాలవిచారముగా నున్నయది. జయంతా!

కల—మీరుమాలయిన నాకొసంగుడు. అయ్యో! త్వరితముగా నొకకురిచి తెప్పించవలెను. ఈతని నింటికి గొంపోయెదను.

ప్రియం—అయ్యో! మూర్ఛిల్లుచున్నాడు. జయంతా! జయంతా! జయంతా!

కల—ప్రభువులారా! ఈకాంతకీ ఘోరకృత్యాచరణమం దించుకపాలు కలదని తలచెదను. జయంతా! ఇంచుకసేపోరిమి జేయుడు. రండు, రండు, దీపము తెండు.—ఎవరీతడు మనమెన్నడైన చూచియున్న ముఖమేనాయిది? అయ్యో! మిత్రులారా! ఈతడు మన కామపాలుడు! కాడు! ఔను! నిజముగా కామపాలుడే! అయ్యో దైవమా! యెంతకష్టము! కామపాలా!

నీతి—కాశ్మీరదేశీయుడైన కామపాలుడేనా?

కల—అతడేనండి! అతడేనండి! తమరెరుగుదురా?

నీతి—హుం. ఎరుగుదును.

కల—ప్రభువులయిన నీతివంతులా? అయ్యో! నన్నుక్షమించవలెను. ఈతొందరలో తమ్ము పరకించి యెఱుగకుంటిని.

నీతి—నిన్ను చూచుట నాకు చాల సంతోషముగా నున్నయది.

కల—జయంతా! ఎట్లున్నది? కురిచీ! కురిచీ!

నీతి—కామపాలుడేనా?

కల—అతడే! అతడే! (కురిచీ తెచ్చుచున్నారు.) మంచిపనిచేసినారు. ధర్మాత్మ లవరైన నీతని నింటికి గొనిపొండు. నేనుపోయి వైద్యులను పిలిచికొనివచ్చెద. (ప్రియంవదవైపు తిరిగి) నీనాలుక నించుక కట్టిపెట్టుము. అయ్యో! జయంతా! ఇప్పుడు మీచేత చంపబడ్డవాడు నాస్నేహితుడైన కామపాలుడు. మీకిరువుర కును వైరమేమిగలదు?

జయం—వైరమునులేదు. నేనీతని నెరుగనైన నెరుగను.

కల—(ప్రియంవదవైపు తిరిగి) ఏమి నీవు తెల్లబోవుచున్నావు?— అయ్యో! గాలిలో నుండి యవతలకు గొంపొండు.

(జయంతుడును, కామపాలుడును అవతలకు గొంపోబడుచున్నారు.)

ప్రభువులారా! ఇంచుక నిలుడు. ఈమె భయమంత యీమెకన్నులలో నెట్లు కనుపించుచున్నదో చూచితిరా? నీవు తేరిపారి చూచినకొలది నీపై ననుమాన ము వృద్ధియగుచుండును. ప్రభువులారా! ఈమెముఖమును బరీక్షింపుడు. నాలుక చెప్పకున్న పోలికె చెప్పకమానదు.

[దుర్గ ప్రవేశించును.]

దుర్గ—అయ్యో! నాథా! ఏమి యీగొడవ! ఏమి! ఏమి!

కల—జయంతు నంతంబునొందించు నుద్దేశముతో కామపాలుడు మొదలగు కొందరు ద్రోహు లాతనికి గాయములు తగిలించిరి.

దుర్గ—అయ్యో జయంతా! అయ్యో ప్రభువులారా!

కల—ఇది వ్యభిచారదోషఫలము. దుర్గా! నీవుపోయి జయంతు డెచ్చట భోజనము చేసెనో యెఱింగిరమ్ము. నీవట్లు తెల్లబోయెదవేల? ప్రియంవదా!

ప్రియం—నాయింట భోజనము చేసెను. అందువల్ల నే తెల్లబోవుట లేదు.

కల—అలాగునా? ఇది నీపనియేయనుటకు సందేహము లేదు. నీవు నన్ననుగమిం పుము. తగినపని యొనర్చెద.

దుర్గ—ఛీ! ఛీ! లంకుతొత్తా! సిగ్గు! సిగ్గు!

ప్రియం—నేనట్టిదానను కాను. నేనును నీవంటిదాననే.

దుర్గ— ఛీ! ఛీ! నోరుమూసికొమ్ము. నావంటిదాననా!

కల— ప్రభువులారా! మనము పోయి జయంతునకు తగినగూఢపథము లిప్పించవలెను. దుర్గా! నీవేగి జయద్రథునకును వారిభార్యకు నీవృత్తాంత మెరింగించి రమ్ము. (తనలో) నా కీడుమేళ్ళీరాత్రి స్థిరపడగలవు. (నిష్క్రమించును.)

[రంగము పడకగది.— దీపము వెలుగుచుండగా గుణవతి శయ్యపై నిద్రించుచుండును.]

(జయద్రథుడు ప్రవేశించును.)

జయద్ర— అదే! అదే! కారణము. ఓ పతివ్రతాశిరోమణులారా! మీరాకారణము కలనైన వినకుందురుగాక!

ఉ॥ మేలిమిచన్నె బంగరును మించగజాలిన కాంతిపుంజముల్
రాలిచి ఘుమ్ముఘుమ్మనను తావులపూలను ధిక్కరించుచున్
బోలిక కీడు లేనిసతి పూజితదేహము రక్తవాహినీ
జాలము చేయనోపుదునె జాలిదలంపక యెంత నేర్తునే!

క॥ కటకట చంపకయుండిన
పటుసాహసవృత్తినాకు పరిభవముగదా
విటులలో గుల్కుచునుండుట
నెటులైనను జంపవలయు నిప్పుడ కాంతన్.

కట్టా! తనతేజో మహిమంబున మందిరంబెల్ల వెలింగించుచున్న యీదీపజ్వాల నార్పక ప్రాణదీపజ్వాల నెట్లార్పుదు? ఓదీపమా! నిను పెద్దజేసిన కావాలెనన్న మరల వెలిగించగలము గాని యీ పూర్ణసౌందర్యలక్ష్మీ భాసమానంబగు ప్రాణదీపంబు నార్పి మరల వెలిగించుట నాకవశమకదా! చెట్టునుండి కోసిన కుసుమంబు మరల నతుకుట సాధ్యమా? అది వాడిపోవలసినదే కాని! ఈసౌందర్యకుసుమంబునకు చెట్టుపయిన వాసనజూచెదగాక! (ముద్దిడుచున్నాడు.) కటా! ఈసౌందర్యమహిమ న్యాయలక్ష్మి చేయూతనీయుచున్నగదా! ఇంకనొకటి, ఇంకనొకటి, ప్రాణత్యాగ మొనర్చియు సౌందర్యత్యాగ మొనర్పకుము. నీయనంతరమును నిన్ను నే ప్రేమించుచుండెదగాక! ఇక నొక్కటేకడ ముద్దు. ఇంతయందగత్తెలకెట్టి దుర్బుద్ధు లిదివరకు కనియెరుగను. నాకన్నీళ్ళింత క్రూరములు. అయినను నాయేడ్పు దైవసంబంధమయినది. తాను ప్రేమించువస్తువను నాశంబు నొందింపగలదు. ఆమె నిద్ర లేచుచున్నది.

గుణ—ఎవరువారు? నా నాథులా?

జయద్ర— ఔను.

గుణ—అయ్యో! పరుండెదరా?

జయద్ర—ఈరాత్రి దైవమును ప్రార్థించితివా?

గుణ—ప్రార్థించితిని నాథా!

జయద్ర—పశ్చాత్తాపములేక యేపాపముగాని మనస్సున దాచియుంచితివేని దానికై నిన్ను క్షమియింపుమని దైవమును త్వరితముగా ప్రార్థింపుము.

గుణ—అయ్యో! నాథా! మీమాటలు నాకర్థమైనవి కావు.

జయద్ర— త్వరితముగా ప్రార్థింపుము. నేనిక్కడ నడుచుచుండెద. మరణమునకు ప్రయత్నముగనున్న నిన్ను చంపనొల్ల.

గుణ—మరణము మాటలేల మాటాడెదరు?

జయద్ర—నిన్ను చంపెదను.

గుణ—నన్ను దైవము రక్షించుగాక!

జయద్ర—ముఖ్యముగా రక్షించునుగాక!

గుణ—మీరట్లు చెప్పుచున్నారుగాక నన్ను చంపరని నమ్మెదను.

జయద్ర—హుమ్.

గుణ—మిమ్ముల జూచుటకు నాయొడలు కంపము జెందుచున్నది. మీరు కనుగ్రుడ్లటు త్రిప్పినప్పుడు ప్రాణోపద్రవము చేయకపోరు. నేనేపాపము నెరుగనిదాననగుటచే నేలభయముపడవలెనో నేనెరుగను.

జయద్ర—నీపాపములు బాగుగ జ్ఞాపకము చేసికొమ్ము.

గుణ—మిమ్ముల నత్యంతము ప్రేమించుటతప్ప మరి యేపాపము నెరుగను.

జయద్ర—అందుకే నీవు చచ్చుచున్నావు.

గుణ—ప్రేమించినందుకు చంపుటయన్యాయము. పండ్లక్లేల కొరికెదరు? ఎద్దియో భయంకరమగు నభిమానము మీమనస్సును పట్టినది. ఈలక్షణములెల్ల నెద్దియో ఘోరకృత్యాచరణమును సూచించుచున్నవి. అవి నాపైకే రాదని మాత్రము నమ్ముచున్నాను.

జయద్ర—ఇంక మాటాడకుము.

గుణ—మాటాడను. ఏమిసంగతి?

జయద్ర— నిన్ను నేనెంతయో ప్రేమించి నీకు కానుకగా నొసగిన రుమాలు నీవు జయంతునకిచ్చితివి!

గుణ — మీ పాదములసాక్షి. నేనెప్పుడు నిచ్చియుండలేదు. అతని పిలిచియడుగుడు.

జయచంద్ర — ప్రాణేశ్వరీ! ఇంక నసత్యము మానుము. నీవు చచ్చుటకు సిద్ధముగా నున్నావు.

గుణ — ఇంతటిచావనుగదా!

జయచంద్ర — ఇప్పుడె చచ్చెదవు. నీవొనర్చిన పాపములుమాత్రము వెల్లడిపరుచుము. నీవెన్నిబాసలుచేసిన నామనస్సు తిరుగదు. నిన్ను చంపకమానను.

గుణ — నన్ను దైవము కాపాడుగాక!

జయచంద్ర — ముఖ్యముగా కాపాడుగాక!

గుణ — నన్ను నీవును కాపాడెదరుగాక! నేను మీకెన్నడు నపకార మొనర్చి యెరుగను. జయంతు నెన్నడును ప్రేమించలేదు. ఎంతవరకు పరపురుషునితో స్త్రీలు మాటాడవచ్చునో యంతకంటె నధికమెన్నడు నాతనితో మాటాడనైన లేదు.

జయచంద్ర — దైవముతోడు. నారుమాలాతనియొద్ద చూచితిని. ఓదుర్మార్గురాలా! నాగుండె రాయి చేయుచుంటివి. నాకన్నులార నారుమాలాతనియొద్దచూచితిని.

గుణ — అయినచో నది యతనికెక్కడనో దొరికియుండును. నేనాతనికిచ్చియుండలేదు. అతనిని పిలిపించుడు. నిజ మాతని నడిగిచూడుడు.

జయచంద్ర — అతడొప్పుకొనెను.

గుణ — ఏమినాథా?

జయచంద్ర — నీతో సౌఖ్య మనుభవించెనని?

గుణ — ఏమీ? అన్యాయముగానా?

జయచ — ఏమి?

గుణ — అతడట్లనియుండడు.

జయచంద్ర — అతని నోరిదివరకె మూయబడినది. న్యాయశీలుడగు కలహప్రియుని కా పని నియమించితిని.

గుణ — అయ్యో! అతడు మరణము నొందెనా?

జయచంద్ర — అతని తలవెంట్రుకలెల్ల మనుజులుగా మారినవారినందరి మ్రింగశక్తి నాకు కలదు.

గుణ — కటకటా! నావలె నతడును మోసపోయినాడా!

జయచంద్ర — ఛీ! రంకులాడీ! నాముఖముముందర నాతనికయి యేడ్చెదవా?

గుణ — నాథా! నన్ను చంపకుము. ఏదేశమయిన పంపనయిన పంపుడు.

జయద్ర—నోరుమూసికొమ్ము! లంజా!

గుణ—కటా! కటా! నాథా!—(మూర్ఛిల్లును.)

జయద్ర—మూర్ఛిల్లితివా! ఆఁ! మూర్ఛ కాదు. ప్రాణత్యాగమే చేయుచున్నది. ఇట్టి ఘోరకృత్యము నా చేతులతో చేయించక దైవము న్యాయము విచారించి తాన యొనర్చెను. ఇంకను ప్రాణము పూర్తిగా పోలేదు.

దుర్గ—(తెరలో) మహాప్రభూ! మహాప్రభూ!

జయద్ర—ఇంకను పోలేదా? కదలుట మానినది. దీపమారిపోయెనే. ఇప్పుడే పోగలదు.

దుర్గ—(తెరలో) మహాప్రభూ! మహాప్రభూ!

జయద్ర—ఎవరువారు?

దుర్గ—(తెరలో) ఒక్కమాట చెప్పవచ్చితిని మహాప్రభూ!

జయద్ర—ఈమాటలు దుర్గునివనుటకు సందేహము లేదు.—పోయియుండునా? పోయినది. చలనము పూర్తిగా పోయినది.—ఆమెను లోనికి రానిచ్చిన నేమి? ఇప్పుడేమి చేయుదు? లోనికి వచ్చినతోడనె నాభార్యతో మాటాడకమానడు. నాభార్య! నాభార్య! ఇక నెక్కడిభార్య? నాకు భార్య లేదు. ఈనిమిషము భరించుట కెంతయు శక్యముగా నున్నయది. అబ్బా! ఏమి చేయుదు? సూర్యచంద్రుల కేకదినంబున పూర్ణగ్రహణంబులు సంభవించి బ్రహ్మాండకటాహము ముక్కలయినట్లు తోచుచున్నదిగదా!

దుర్గ—(తెరలో) మహాప్రభూ! తమతో నొక్కవార్త చెప్పవచ్చితిని.

జయద్ర—మరచితిని. లోనికిరమ్ము దుర్గుడా—బట్ట ముసుగువేసెదను. లేనిచో చూడగలడు—

క॥ తన పాపచింత భయమును
పెనగొన యూలేవమిగుల వెదరున దేహం
బునుబాసి చనెను దైవము
ననుకూలుడ యిప్పుడు నాకు నాలోచింపన్.

[దుర్గుఁడు ప్రవేశించును.]

జయద్ర—ఏమివార్తలు దెచ్చితివి?

దుర్గ—నట్టనడివీథిని దుర్మార్గపుహత్య జరిగెను!

జయద్ర—ఇప్పుడా?

దుర్గ—ఇప్పుడె మహాప్రభూ!

జయద్ర— ఇదియొక గ్రహచారఫలము. ఎద్దియో దుష్టగ్రహము భూమిని సమీపించెనుగాబోలు? జనులకు మతులు చలించుచున్నవి.

దుర్గ—జయంతుడు కాశ్మీరదేశీయుడగు కామపాలుడనువానిని జంపెను.

జయ—జయంతుడు చచ్చెనా? లేక కామపాలుడు చచ్చెనా?

దుర్గ—జయంతుడు చావలేదు.

జయద్ర— జయంతుడు చావలేదా? తలచిన సత్కార్యమునకు గొప్పవిఘ్నము జరిగెనే!

దుర్గ—నిండుగృహమందు దీపములేక నిద్రించెదరేల మహాప్రభూ! అమ్మగారేమి చేయుచున్నారు? (శయ్యజేరి గుండెలు తట్టుకొని) అమ్మగారిట్లు వికృతరూపమున పరుండిరేమి ప్రభూ!

జయద్ర—పరుండలేదు. నరకబాధల రుచిచూడబోయినారు.

దుర్గ—అయ్యో! దైవమా! ఏమి మహాప్రభూ! ఏమి ప్రభూ!

జయద్ర— రక్కసివలె పుడమిపై పాపములు చేసిచేసి నేటికి నరకమును చేర నేనె చంపితిని.

దుర్గ—ఏమి! ఏమి! ఏమి! ఆమె కేవలము స్వర్గమునకే పోయినది. మీరుమాత్రమే దయ్యమువలె రాక్షసికృత్యము చేసినారు!

జయద్ర—తనదుర్గుణముల క్రమముగా చూపి తుదకు కట్టుజారిణి యైనది.

దుర్గ—నీవామెపై నబద్ధములాడుచున్నావు. నిజముగా నీవు రాక్షసివే.

జయద్ర—నన్నామె నీటివలె మోసము చేసినది.

దుర్గ— నీవామె నగ్నివలె కారణములేకయే జంపితివి. ఆమె మోసము చేసెనా? ఆమె సద్వర్తనమందు దేవినివంటిది కాదా?

జయద్ర— నేనిట్టికృత్యము తగినకారణములు లేకయే చేసిన నేనిజముగా శాశ్వతనరక మనుభవించవలసినదే. నీపతి యదియంత యెరుగును.

దుర్గ—నాపతి!

జయద్ర—నీపతి! నీపతియే!

దుర్గ—వివాహనిబంధనల నతిక్రమించెనని!

జయద్ర—ఔను. జయంతునితో—ఆమె సద్గుణవతియే యైనయెడల, నన్ని బ్రహ్మాండకటాహమునకెల్ల నధిపతిగా నొనర్చెదనన్న నేనామెను విడువనొల్లనునా?

దుర్గ—నాపతి!

జయద్ర— ఔను. అతడే నాకీసంగతి మొదట తెలియజెప్పెను. మిగుల మర్యాద

స్థుడు. న్యాయదృష్టి గలవాడగుటచే నిట్టి దుష్కార్యములు సహింపడు.

దుర్గ—నాపతి!

జయద్ర—ఏమియిట్లు నాశ్చర్యపడి యడిగెదవు? నీ పెనిమిటియేయని చెప్పలేదా?

దుర్గ— అయ్యో! తల్లీ! నీ నిందుప్రేమ నిష్కారణద్రోహులచేత పాడు చేయబడినదిగదా! ఆమెజారయని చెప్పినది నాపతియే నా?

జయద్ర—అతడే. నీపతియేయని వేయిసారులు చెప్పితిని. ఇప్పుడైన తెలిసినదా? నాస్నేహితుడు, నీ పెనిమిటి, న్యాయదృష్టికలవాడు, సత్యవాక్యధురీణుడయిన కలహప్రియుడు.

దుర్గ—అట్లు చెప్పినయెడల నాతని దేహము దినమున కరవగింజయెత్తున తగ్గుచు క్రమక్రమముగా కుళ్ళికుళ్ళి నశించుగాక! అతడెప్పు డబద్ధము లాడుచునే యుండును; ఆమెయు నీ ప్రీతిముఖమును వీక్షించి స్వర్గముగా సంతసించుచుండె.

జయద్ర—హుష్.

దుర్గ—నీ చేతనయిన పనిచేయుము; నీ కామె యెంత తగియుండెనో నీవొనర్చిన కృత్యము దైవమునకంత గా తగియున్నది.

జయద్ర—నీ వింతట నోరుమూసికొనిన బాగుగానుండును!

దుర్గ—నీవొనర్చగలకీడుకంటె రెట్టింపు కీడొనర్చిన లక్ష్యపెట్టను. ఓ దుర్భాగ్యుడా! ఓ మందమతీ! బుద్ధిహీనుడా! నీ వొనర్చినపని—నీకత్తికే లక్ష్య పెట్టను; నా ప్రాణమోసమునకయిన నోర్చి నీదుష్కార్యము వెల్లడిచేయకమానను. రండి! రండి! హత్య! నరహత్య! జయద్రథుడు గుణవతిని చంపినాడు. హత్య! హత్య (నీతిమంతుడును, సూక్ష్మబుద్ధియు, కలహప్రియుడును మొదలగువారును కాగడాలతో ప్రవేశించుచున్నారు.)

నీతి—ఏమండీ జయద్రథా! ఏమివార్తలు?

దుర్గ—కలహప్రియా! వచ్చితివా? మంచిపని చేసితివే. ఈహత్యలెల్ల నీనెత్తిపయి బడుచున్నవి.

సూక్ష్మ—ఏమిసంగతి?

దుర్గ—నీకు మగతనము గలదేని యీదుర్మార్గుని దుర్మార్గము బయలుపుచ్చుము. తన భార్య జారయని నీవుచెప్పితివని చెప్పుచున్నాడు. నీవు యోగ్యుడవుగాన యట్లు చెప్పియుండవని నమ్మెదను. నా మనస్సు పూర్ణముగా నున్నయది. త్వరితముగా చెప్పుము.

కల—అతని కన్నులార చూచినవిషయములను, చెవులతో విన్న విషయములను తప్ప వేరునేనేమియు నాకబద్ధములని తోచిన సంగతులు చెప్పలేదు.

దుర్గ—ఆమె జారయని యెప్పుడయిన చెప్పియుంటివా?

కల—చెప్పితిని.

దుర్గ—నీవసత్యము నుడివినావు. భయంకరమగు పాపకారణమునగు నబద్ధము నాడితివి. నా యాత్మ తోడు! ఎంతకాఠిన్యమగుదబ్బర! జయంతుని ప్రేమించె నని నీవు చెప్పినది.

కల—జయంతునితోనే! సఖీ! నీకామాటలేల నీవూరకొమ్ము.

దుర్గ—నేనూరకొనను. యూరకొనుటకు సమయము గాదు. నేను మాటామాటకిప్పుడు బద్ధురాలనయి యున్నాను. మా యజమానురాలుగారు చంపబడి శయ్యాపయి బడియున్నారు— ఆ బట్టముసుగు చూడుడు!

అందరు—అయ్యో! అయ్యో! ఏమి యీవింత?

దుర్గ—ఈపని నీబోధవల్ల జరిగినదట!

జయచ్ర—వెళ్లబోయి చూచెదరేల? ఇది నిజమయిన వార్తయే.

సూక్ష్మ—ఇది చిత్రమైననిజము.

నీలి—అయ్యో రాక్షసికృత్యమా!

దుర్గ—ద్రోహము. ద్రోహము. ద్రోహము! నాకాలోచన పాలుపోవుట లేదు. తలచినంత దేహము కంపము జెందుచున్నయది. అయ్యో ద్రోహమా! నేనిది మునుప యూహించితి! ఇంత విచారముతో బ్రతుకగూడదు. అయ్యో ద్రోహమా! ద్రోహమా!

కల—నీకు పిచ్చిపట్టినదా? త్వరితముగా నింటికిపొమ్ము.

దుర్గ—ప్రభువులారా! నన్ను మాటాడనిండు. నేనీతనికి విధేయత చూపుటకు దగిన సమయ మిది కాదు. కలహప్రియా! ఇంటికి నేనింక నెన్నటికి పోక పోవచ్చును.

జయచ్ర—అయ్యో! అయ్యో! అయ్యో! (మరియొక పరుపుపై పడి యేడ్చుచున్నాడు)

దుర్గ—భూమిమైబడి పొరలుచు మరియేడ్వుము; పరపురుషులవంక కన్నెత్తిచూడని పరమపతివ్రతాశిరోమణిని చంపితివి.

జయచ్ర—గొప్పపాపకృత్యము లాచరించినది. విమ్ముల చూడలేదు మామా, మీ కొమార్తె ప్రాణములుపోవ యిచ్చటన పడియున్నది. నేనానర్చినపని మాత్రము

ఘోరముగా కనుపించకమానదు.

సీత—అయ్యో గుణవతీ! నీతండ్రి కడు వృద్ధప్పవాతుడుగాన నీకంటె ముందు పరలోకగతుడైనాడు. నీవివాహస్థితి దలచి కృశించికృశించి తుదకు ప్రాణత్యాగము చేసినాడు. ఇప్పుడాతడు బ్రతికియుండిన యీవార్తవినిన నేమి చేసియుండునో.

జయద్ర—ఇది నిజముగా విచారకరమగు సంశయమే. అయిన జయంతునకు నామెకు గల సంబంధమును అతనితో నామె యెన్నివేలసారు లాడుచు కార్య మాచరించినది. సర్వము నీకలహప్రియుడెరుగును. జయంతుడీవృత్తాంతమంతయు చెప్పకొనెను. తన జ్ఞాపకార్థమాతనికి నేను తన వివాహమునాడు మక్కువచే తన కొసగిన రుమాలు జయంతునకు కానుకగా నిచ్చెను. దానిని నేనాతని యొద్ద చూచితిని. అది నాతండ్రి నా తల్లికొసగిన మొదటి బహుమానము.

దుర్గ—అయ్యో దైవమా! ఓ పంచభూతములారా!

కల—నోరుమూసికొమ్ము.

దుర్గ—ఆమాట మనస్సున నిముడదు. రాకమానదు. నేనూరకొనను. నేనెవారి యొకగాడుపువలె తీవ్రముగా మాటాడెదను. దైవమును, మనుష్యులను, దయ్యములను, నన్నడ్డము పెట్టినమానను.

కల—తెలివిగలిగి యింటికిపొమ్ము.

దుర్గ—నేపోను.

[కలహప్రియుడు దుర్గను పొడువబోవును]

సూక్ష్మ—ఛీ! ఆడుదానిమీదనా నీసాము.

దుర్గ—ఓ మూర్ఖశిఖామణీ జయద్రథా! నీవు చెప్పుచున్న రుమాలు నాపతి కేను యొసంగితి. తనకా రుమాలు ముఖ్యముగా కావలెనని యు, దానిని దొంగిలించి తనకిమ్మనియు కడు నాతృతతో ననేకపర్యాయములు యడుగుచు వచ్చెను. తుదకది నాకు దొరకనతనికొసగితిని.

కల—ఛీ! ఛీ! దార్పుక్త్రియా!

దుర్గ—ఆమె జయంతునకొసగెనా! లేదు! లేదు! నాపతికది నేనయొసంగితి.

కల—తొత్తా! నీవబద్ధమాడుచున్నావు.

దుర్గ—దైవసాక్షి. లేదు, లేదు, నేనబద్ధమాడుట లేదు. ప్రభువులారా! ఓ దుష్టమృగమా! అంతమంచియిల్లాలి నట్టిదుర్భాగ్యుడింకరేమి చేయగలడు? అయ్యో! అయ్యో [మూర్ఛిల్లును.]

జయద్ర—ఆకాశంబున పిడుగులయి పడుటకు తగినరాత్రులేవని నమ్మెదను?— పరమఘాతకా!

[కలహప్రియునివైపు పరుగుపెట్టును; కలహప్రియుడు పారిపోవును.]

నీతి—ఈతడొకడు ఘాతకుడు. నేనిప్పుడే జయద్రథునుండి చేకొనిన యీ యాయుధము నీవుచేయూనికావలిగా యుంచుదును. ఆతని చంపనైన చంపుము గాని వెలుపలకుమాత్రము రానియ్యకుము. నేనుపోయి యాదుష్టుని కొనితెచ్చెద. అంత దుష్టుని విడుచుట పాడిగాదు. (నీతి నిష్క్రమించెను.)

జయద్ర— నాస్థైర్యమును బలమును గూడ నడచినవి. ప్రతిమరిగుజ్జయును నాచేతి కత్తి పెరికికొన సమర్థుడగుచున్నాడు. పతిభక్తికంటె మర్యాద యెక్కువ కాలమేల బ్రతుకవలెను? అన్నియు నాక్కమారపోవలెను. ఇప్పటనే మరియొక కత్తిగూడగలదు. ఇదిబహుమంచికత్తి. షెదొరికినది. అయ్యో! వచ్చుచున్నాను. జాగ్రత.

సూక్ష్మ—(తెరలో) మీరట్లుచేసితిరేని మిక్కిలి శ్రమల పాలగుదురు. మీయొద్ద నాయుధములయిన లేవు.

జయద్ర—నావలుపుజూచి మాటాడుడు. ఇప్పుడె నేను మీతో పోరాటమునకు డీకొనియెదను.

[సూక్ష్మబుద్ధి ప్రవేశించును.]

సూక్ష్మ—ఏమిసంగతి?

జయద్ర—నాయొద్ద నెంతమంచికత్తిగలదో చూడుడు. ఏశూరుడుగాని యింతకంటె మంచికత్తినెన్నడయిన తనతోడపయి నిడుకొనెనా? ఈకత్తిని ధరించి యీ చిన్ని హస్తముతో మీకంటె నిరువదిరెట్లు బలముగల జనముతో పోరాడి గెలిచితిని. కటా! ఎందుకు నాప్రజ్ఞ! కాలమునకెవరెవ్వరు నడువగలరు? నాచేత కత్తికలదని మీరుభయపడకుడు. మీరింటికి విచారించుచుబోయెదరు గాబోలు! జయద్రథుడు నెవ్వరేని యెదిరించినంతమాత్రమున నాతడు జయింపబడును. ఇక నాతడెక్కడకుపోగలడు? అయ్యో! ప్రాణేశ్వరీ! నీపూర్ణచంద్రనిభాననం బిప్పుడెట్లున్నది? ఎంత వికృతాకారము దాల్చితివి. నేను నీశయ్యదరి కయిన జేరలేను. నిన్నిట్టులజూచుటవలన యమలోకమున మాడుచున్నయుక్కుస్తంభమును కౌగిలించుకొనినట్లున్నది. అయ్యో దుష్టుడా! ఎంతపని చేసితివి. ఓ యమదూతలారా! ఇంతపని చేసినందుకు నన్ను మిక్కిలి బాధించుడు. మండుచున్న గంధకములోనుంచి పిమ్మట నగ్నిలో కాల్చుడు. గుణవతీ! గుణవతీ! గుణవతీ! అయ్యో! అయ్యో! అయ్యో!

[నీతిమంతుడును, మనోరంజనుడును, కరిచీలో నెక్కి జయంతుడును,
కలహప్రియుని తీసికొని భటులును ప్రవేశించుచున్నారు.]

నీతి— దురదృష్టవంతుడగు జయద్రథుడేడీ?

జయద్ర—ఇచ్చటనే యున్నాను.

నీతి—ఆకృత్యసాధనమేడీ? ఆద్రోహిని నిటుకొనిరెండు.

జయద్ర— అతని కార్యసంకట జూచెదను. అది కథగాని నిజముకాదు. నీవు నిజమగు దయ్యమవైనచో నిన్ను సేవింపవలెను.

(కలహప్రియుని పొడుచుచున్నాడు.)

నీతి—ఆకత్తి తీసికొమ్ము.

కల—రక్తము కారుచున్న దిగాని యింతటితో ప్రాణోపద్రవము రాదు.

జయద్ర—అది మరి నాకు విచారముగా లేదు. ఇట్టిబ్రతుకు బ్రతుకుటకంటె చచ్చుటయే మేలని నాయుద్దేశము.

నీతి—దయాలయుడవని పేరుపొందిన జయద్రథా! ఇట్టి ఘాతకుని వలలలో జిక్కి చెడితివిగదా! ఇప్పుడు నిన్నేమి చేయవలెను?

జయద్ర—మీరేమిరెమినర్చినను సరే. నేనొనర్చిన దుష్కార్యము న్యాయమనుబుద్ధితో నొనర్చితినిగాన మర్యాదగల మరణము విధించినను సరే!

నీతి— ఈ నీచుడు తనయుద్దేశముల కొన్నిటిని చెప్పుకొనినాడు. మీరు నీతడును కలిసియే నాజయంతుని చంప దలపెట్టిరి.

జయద్ర—ఔను.

జయం—ప్రేమగల సేనానాయకా! అంతపని దలపెట్టుటకు తగినయపకారమెట్టిదియు నేను మీకొనర్చియుండలేదు-

జయద్ర—నీమాటలు నిజమని నమ్మెదను. నన్ను నీవు క్షమింపవలెను. ఈరాక్షసి నన్నిట్టికష్టములపాలొనర్చెనో యించుక కనుగొనెదరా?

కల—నన్ను మీరేమియు నడుగవద్దు. ఎరిగినదానిని మీర యెరుగుదురు. ఈక్షణము మొదలు నేనిక మాటాడను.

నీల—దైవమును ప్రార్థించుటకైన మాటాడవా?

సూత్ర— మాటాడకతప్పునా? నీవనుభవింపబోవు బాధలే నిన్ను మాటాడింపగలవు.

జయద్ర—నీవు మంచిపని చేసితివి.

నీతి—ఇదివరకు మీరెరుగరుగాన నీఘోరకృత్యములోని సత్యము మీరెరుగవలెను. గతప్రాణుడగు కామపాలునివద్ద కొన్నియుత్తరములు దొరికినవి. వానిలో నొకదానివలన జయంతుని మరణమునొందించుటకు కలహప్రియుడు కామపాలుని నియమించినట్లు కనుపించుచున్నయది.

జయద్ర—పరమఘాతుకా!

జయంతు—నిర్భాగ్య పిశాచమా!

సీత—ఇది మరియొకటి దీనిని కలహప్రియునకు కామపాలుడు పంపదలచె. ఇంతట కలహప్రియుడు స్వయముగాపోయి యాతని సమాధానపరచెను.

జయద్ర— ఓ కాలసర్పమా! జయంతా! నేను నా భార్యకొసగిన రుమాలు నీకెట్లు చేకూరె?

జయం— నాకది నా పడకగదిలో దొరకినది. ఎద్దియో కార్యప్రాప్తికై కానక్కడ పడవైచితినని యాతడొప్పుకొనెను. దానివలన తనకోరిక కొనసాగెనట.

జయద్ర— ఓరీ! బుద్ధిహీనుడా! బుద్ధిహీనుడా!

జయం— నాదు, కోటపై కాపుకాయుతరి నన్నెదిరించుటకు తనను పంపినందు కెన్నోవిధముల కలహప్రియుని నిందించుచు కామపాలుడు వ్రాసిన యుత్తరము మరియొకటి దొరికినది. నాయుద్యోగము పోవుటకు నీతడె కారకుడు. చాల సేపువరకు చచ్చినట్లు కనుపడి కామపాలుడు తనను "కలహప్రియుడిట్టి పనికి నియమించియు పిదపకాతడె పొడిచెనంచును చెప్పి మృతినొందె."

జయద్ర— కటకటా. కలహప్రియా! ఎంత చేసితివి! ఎంత చేసితివి! అయ్యో ప్రియసఖీ! ప్రియసఖీ! ప్రాణేశ్వరీ! గుణవతీ! గుణవతీ!

[గుణవతి మూర్ఛదేరుచున్నది.]

గుణ— నాథా! మరచినిద్రించితిని. ఏల పిలిచెదరు?

[తెర పడును.]

లోపల కలకలము. ఏమివింత! ఏమివింత! గుణవతీ! ప్రాణనాథా! ఎంతవింత! ఏమిజరిగినది?—

రంగము—కోటగుమ్మము.

[ఇద్దరు చెలికత్తెలు ప్రవేశించుచున్నారు]

౧.—చెలియా! రాత్రిజరిగిన వింతయెల్ల వింటివా?

౨.—వింటిని! వింటిని! ఏమియద్భుతము! ఏమిచిత్రము! తుద కాదుష్టుడగు కలహప్రియుని కేమిశిక్ష విధించినారు?

౧.—అయ్యో! వినలేదా? అది యంతకంటె నద్భుతమగు సంగతి. జయద్రథునకు తన ప్రాణేశ్వరిగూడి మరణావస్థ మూర్ఛకొనిన పిదప, నీతిమంతుడు, సూక్ష్మబుద్ధి, జయద్రథునను గూడి న్యాయసభజేసి జయంతుడు, దుర్గుణ మొదలగు వారివలన కలహప్రియుడొనర్చిన నేర మంతబాగుగా నెరింగి, తగినశిక్ష చేయనున్న యవసరమున గుణవతి తనస్వభావసద్గుణ మగుపడునట్లాతని నీతప్పునకు మన్నింపుమని పతిని ప్రార్థించెనట!

౨.—ఇది నిజముగా చిత్రముగా నున్నయది! తన ప్రాణోపద్రవ మాచరింపదల పెట్టినవాని కరుణింపుమనుట లోకములో కలదా? అయినమన్నించెనా?

౧.—భార్యమాట కడుగుదాటని జయద్రథుడు మన్నించకమానునా? మన్నించి పంపెను.

౨.—అతని ముక్కుముక్కలుగాకోసి గ్రద్దలకెగరవైచిన బాగుగానుండును.
౧.—మరియొక చిత్రముగలదు. మన చెలికత్తెయగు ప్రియంవద యదృష్టము వింటివా?
౨.—ఏమి? వినలేదు.
౧.—నేటిదినమామె జయంతుని వివాహమాడగలదు. జయద్రథుడు తన స్థానము జయంతునకిచ్చి, వృద్ధినొందిన తన మామగారి ప్రధాన మంత్రిపదవి చేకొనుటకై రేపు దేశమునకు పోవుచున్నాడు. గాన వివాహమీదినము జరుగక తప్పదు.
౨.—ప్రియంవదకు తగిన సంబంధము దొరికినది. ఆమె గుణములకును, శీలమునకును, కులగోత్రములకును రూపమునకును గూడ తగిన సంబంధము.
౧.—పెండ్లికూతురైన ప్రియసఖిని కన్నులార జూచవత్తమురమ్ము. మహూర్తమీపాటి జరిగియుండవచ్చును.
౨.—అట్లయిన శీఘ్రముగా రమ్ము.

(నిష్క్రమించుచున్నారు.)

రంగము—కోటలోని చావిడి.

[ఒకరిచేతి నొకరు పట్టుకొని జయద్రథ గుణవతులును, నిగమంతుడును, సూక్ష్మబుద్ధియు, మనోరంజనుడును, చోపుదార్లు, ఉద్యోగస్థులు, దొరలు, పౌరకులు, సేవకులు, దాసదాసీజనంబులును తోడరా, కుంటుచు పెండ్లికొడుకగు జయంతుడు ప్రియంవద చెట్టబట్టి పెండ్లిబట్టలతో ప్రవేశించుచున్నాడు.]

గుణ—నాథా! మనమైన మెప్పుడేర్పరచినారు? శుభముహూర్తము కుదిరినదా?
జయద్ర—రేపటి సాయంత్రము కుదిరినది. రేపు బయలుదేరవచ్చునా?
గుణ—ముఖ్యముగా రేపు బయలుదేరవలెను.
సూక్ష్మ—(నవ్వుచు) జయంతుడా! మీకు సేనానాయకత్వపదవి దొరకుటచేతనా లేక ప్రియంవద దొరకుటచేతనా మీ కాలునొప్పి త్వరితముగా మానినది.
జయంతు—అదియు నిదియుగూడ గాదు. ఈ విదూషకుని యాశీర్వచనఫలము దొరకుటచే మానినది.
విదూ—నిజమే! నిజమే! రాత్రి ప్రియంవదను కలహప్రియుడు కట్టిన కట్లను నా నెత్తి బొప్పికట్టినది. నేటియుదయము నన్ను నేను "బొప్పి కుదురుగాక" యని యొక్కమా రాశీర్వదించుకొంటిని. వెంటనే బొప్పిమానెను. నా బొప్పి మాన్పగలిగిన యాశీర్వచనము జయంతుని నొప్పి మాన్పెననుట వింతా!
ప్రియంవద—(తల వాల్చుకొనుచున్నది.)
విదూ—చూచితిరా? కలహప్రియుని పేరుచెప్పినంత పెండ్లికూతురు సిగ్గుతలవంచుకొన్నదో!
సూక్ష్మ—పెండ్లికొమార్తెమాత్రమే కాదు. అతని పేరు తలచినమాత్రన నాకు నుల్లము ఝల్లుమనుచున్నయది. అతని పేరెత్తబోకు విదూషకా!
విదూ—చిత్తము. తమ సెలవుప్రకారము కలహప్రియుని పేరెత్తను. కలహప్రియుడను

మాటగాదు. కలహామనుమాటగాదు. కలయనుమాటగాదు. క యను నక్షర మయినను దలచను.— కాంతాలింగనకాలాత వరషెదను.

సీత—మీర లీమాట లింకచాలించి యాటపాటలతో ప్రొద్దుపుచ్చిన బాగుగానుండును ననుకొనియెదను.

సూత్ర—మాయాటపాటలు కాదు.

మత్తకోకిల॥ పాటిలేని వికాసముల్ మంజుసారసంబుల దోపగా
పాటలెన్నియొ పాడుచుక్ వడిపచ్చవెత్తుచు నెచ్చెలుల్
మాటిమాటికి గుంపులై సుకుమార నాట్యములాడుచుక్
నీటుజూపగ, ప్రొద్దుపుచ్చుట నేడుగావలె నెచ్చెలీ.

విదూ—అయ్యా! అటుకాదు. పెద్దవాడను నేజెప్పెద వినుండి.

మత్తకోకిల॥ కూరలన్నము చారుపప్పును గొప్పలైతగు బూరెలుక్
గారెముక్కలు మాటిమాటికి గారవంబున వేయుచుక్
సారెసారెకు నేతివర్షము చాలగా గురిపించుచుక్
చారులైతగు కన్నదానము ప్రాపగావలె నెచ్చెలీ.

సూత్ర—సుగంధి॥ చిత్తజుండు బాణకోటి చిత్రలీలనంపగా
చిత్తమంత భార్యపైన జేర్చుగాత భర్తతా
నెత్తరిక్ నిజేశుబుద్ధి నెంచుగాత భార్యతో
కోత్తమంపు ప్రేమ నిర్వికారులై మెలంగెదుక్.

సీత—గీ॥ వృద్ధులైనకొలది వృద్ధినొందవలరారు। ప్రేమమునను మీరు పెద్దకాల-
మిలను భాగ్యభోగ్యములతోడ వర్ధిల్లు। ధాతదైవ మిచ్చుగాతవరము.

జయ—క॥ పతివలన తప్పుగలిగిన। పతిసేవని లేనిపోని పంకమమదిలో
జతపరచి కీడు జేయక। సతతముగు నిహాలోకసౌఖ్య సంపదగనుమీ!

గుణ—క॥ నీపతి మిక్కిలికోపము। నీపై నెపుడైన జూప నెలతరో నీవుక్
కోపముజూపక నమ్రత। నేపడసౌఖ్యంబుగొనుము యిలపైనెపుడుక్.

విదూ—మత్తకోకిల॥ మారుడెతో ప్రమోదిరైయె సుకుమారబాణము లేయగా
సారసాక్షులు భర్తతోడుత సర్వసౌఖ్యములందగా
మీర లెల్లరు నిండుగూరుకుంటు మేలొనర్చితిమంచు వే
జేరియుండ్డరు మీరు కాంతలు చెప్పితన్నది యీకథక్.

ఇది సకలసజ్జనవిధేయ, శ్రీమత్పరాశరగోత్రపవిత్రాయ, శ్రీ వల్లూరి శ్రీరంగనాథార్య పౌత్ర, తనయ, శ్రీ పద్మనాభ నామధేయ ప్రణీతంబైన జయప్రదనాటకంబున సకలంబును పంచమాంకము.

వల్లూరి-పద్మనాభరాజు.

స్త్రీ హి తో ప దే శ ము. (౫౭౬ - పుటశేషము.)

సమస్త జంతువులును వానిపిల్లలకు స్తన్యమిచ్చి పెంచుటయెట్లు స్వభావసిద్ధమును, వానివృద్ధికి అవశ్యకమును భగవన్నియామకమును అగునో అలాగుననే స్త్రీలు తమ శిశువులకు స్తన్యమిచ్చి పెంచుట విధాయకకృత్యము. జంతువులు వాని పిల్లలకు పాలియ్యనియెడల అవి అన్నియును త్వరలోనే వినాశమును పొందును. శిశువు జన్మించినవెంటనే ఆశిశువునకు ఆహారముకొరకు భగవంతుడేర్పరచిన స్తన్యము శిశువునకియ్యకపోవుటకంటె క్రూరత్వము మరొకటియుండదు. అంతియకాక శిశువులకు స్తన్యమియ్యని తల్లులకు జాడ్యములుకూడ సంభవించును. అట్టి రోగములవలన మరల సంతాన లాభము కలుగకయుండిపోవును. అవ్యవధిగా కాన్పులు వచ్చుచు శరీరము దుర్బలమై చెడిపోయి మిగుల నీరసించియుండిపోవును. కావున రొమ్ముల పాలున్నతల్లి పిల్లలకు స్తన్యమిచ్చుట విధాయకకృత్యము. గ్రహచారవశమున పాలు లేనియెడల దాదులచేనిప్పించవలెను.

రొమ్ము— మొదటికాన్పునకు ప్రసవమయిన మూడవదినమువరకును స్తన్యము ఉండదు. మూడవదినము మొదలుకొని 3-4 దినములవరకును రొమ్ములు వాచుట, గట్టిగా నుండుట యీ మొదలగు బాధలు కలిగియుండును. స్తన్యజ్వరమని జ్వరము కూడవచ్చును. కావున ప్రసవించినతరువాత రొమ్ములను గూర్చి బహు జాగ్రత వహించవలెను. లేనియెడల మొనదేరి చీముపట్టును. స్తనాగ్రమును రెండువ్రేళ్ళతో నొక్కి స్తన్యమున్నట్టు కనబడినయెడలనే శిశువునకు ఆరొమ్మున స్తన్యమియ్యవలెను. స్తన్యమిచ్చినతరువాత నాలుగు గంటలనగా జామువరకును మరలనియ్యగూడదు. స్తన్యము విశేషించియున్నప్పటికిని అంతసేపటికొకసారియని నియమము ననుసరించియే స్తన్యమియ్యవలెను. రొమ్మున పాలులేనప్పుడు స్తన్యమియ్యబూనినయెడల చీముపట్టి బాధించును. స్తనభాగమందు చెమట మొదలగునవి యున్నయెడల పిల్లలు స్తన్యమును పుచ్చుకొననొల్లరుగావున వేడినీళ్ళతో శుభ్రముగా కడిగి శుభ్రవస్త్రముతో తుడిచి మరియు స్తన్యమియ్యవలెను. ప్రథమ ప్రసవమయిన వెనుక రెండుమూడు దినములవరకును రొమ్ములుగట్టిగావాచి నలుపుగానుండును. అందుకు నూనెలో హారతికర్పూరము కలిపిరాసినయెడల నిమ్మళించును. అట్టిసమయములలో పాలు పిండివేయుటగాని స్వీయజనములో నెవ్వరైన నీరువారున్నయెడల నెమ్మదిగా పళ్ళతో గీరించుటగాని చేసినచో సుఖముగానుండును. విశేషముగా వాచబాధించుచున్నయెడల వైద్యసహాయమున నేదయినను పట్టుగాని అందుకుతగిన కొన్ని విధములయిన ఆకులలో కట్టుగాని వేయవలెను. క్రిందికిజారకుండ చిన్నచిన్న రుమాళ్ళతో మెత్తపెట్టి రుమాలుబిగువు మెడవెనుకకు తీసి ముడివేసి కట్టవలెను. రొమ్ములువాచి

యున్న సమయములో నెప్పు విశేషించి త్రాగగూడదు. ఇట్టి బాధలు మొదటి కాన్పునకు ఉండునుగాని రెండవ కాన్పు మొదలుకొని యుండవు. రెండవ కాన్పు మొదలుకొని రొమ్మునపాలు నిండగానే శిశువులకు స్తన్య మిచ్చుచుండుట చేత బాధయుండదు. రెండవకాన్పు మొదలుకొని శిశువులకు స్తన్యమిచ్చుట మాత్రమే కాని పాలుపిండుట పట్లుమొదలగు నేయితర ఉపాయములను చేయ గూడదు. చేసినచో మరింత నష్టముగాని లాభ మేమియును లేదు. ప్రసవించినపిమ్మట రెండు మూడుదినములకు రొమ్ములను పాలునిండు సమయములో జ్వరమువచ్చును. అప్పుడు బహుజాగ్రతగా నుండవలెను.

స్తన్యమిచ్చు సమయములు—శిశువునకు నియతవ్యవధిగా స్తన్యమియ్యవలెను గాని ఆకలిగాక యేయితర కారణముచేత నేడ్చినను స్తన్య మిచ్చుచుండుట మాతా శిశువు లిరువురకును గూడ మంచిది కాదు. మొదటినెలలో 3 గడియలకగా గంట న్నర కొకసారి స్తన్యమిచ్చుచుండవలెను. రెండవనెలలో రెండుగంటలకొకసారి యిచ్చుచుండవలెను. ఈప్రకారము శిశువెదిగినకొలది వ్యవధి హెచ్చించుచుతుదకు నాలుగు గంటలకొకసారి యిచ్చుట అభ్యాసము చేయవలెను. తల్లులు రాత్రుల యందు శిశువులకు సర్వదా రొమ్ము నోటిలోనుంచి యేపరుందురు. దానివల్ల ఉభయు లకును బలహీనము చేయును. నియమము పగటివలెనే రాత్రులుకూడ నుండవలెను. ఎంతసేపటి కిచ్చుట నియమము చేయబడినదో ఆనియమ మెప్పుడును తప్పకున్న యెడల బాలనయము. తల్లి విశేషముగా నడిచికాని పాటుపడికాని శరీరమంతయు చెమటపట్టు సమయముగా నున్నప్పుడు శిశువునకు స్తన్య మియ్యరాదు. అట్టి సమయములో పాలు వేడిగానుండి త్రాగినయెడల శిశువునకు కొన్నివ్యాధులు కలిగించును గనుక నిమ్మళించినవెనుక శరీరము చెమట మొదలయినవి లేకుండ శుభ్రము చేసికొని మరి స్తన్యమియ్యవలెను.

ఆహారవిషయము—శిశువునకు స్తన్యమిచ్చు స్త్రీ తన ఆహారవిషయములో మిక్కిలి జాగ్రతగా నుండవలెను. అజీర్ణము చేయు విధమున భోజనము చేయరాదు. బాగుగా ఆకలిగానున్నప్పుడు మాత్రమే భోజనము చేయవలెను. తల్లి పుచ్చుకొను పదార్థములగుణము ఆమెస్తన్యమందు కలుగుట విధాయకముగనుక శిశువునకు జబ్బు చేయు నేపదార్థములను తల్లిపుచ్చుకొన గూడదు. పాలదాయి స్తన్య మయినను శిశువులకు తల్లి స్తన్యముతో సరిగావు. శిశువులయొక్క వయస్సునుబట్టి తల్లుల స్తన్యము మారుచుండును. శరీరస్థితులు భేదముగానుండును. పాలదాయులయొక్క నడవడి తెలియుటయును కష్టమే. ఈకారణములనుబట్టి పాలదాయుల స్తన్యము

కంటె శిశువులకు తల్లి స్తన్యమే సర్వాంశములచేతను మేలు. తల్లి పుచ్చుకొను ఆహారము ఎంత లఘువుగను ఆరోగ్యముగను ఉండునో శిశువునకు స్తన్యము అంత శుభ్రముగను సరిపోయి యుండును. లఘువయిన ఆహారమన్నపుడు పథ్యమని కాదు. విశేష బలు హార పదార్థములు విశేష కారము, ఉప్పు వేసిన ఊరుగాయలు ఒక్కరీతి పదార్థములు కాకుండ అనుకూలములయినవి కూర్చుకొనుచు పుచ్చుకొనుచుండవలెను.

పనులు చేయుట— స్తన్యమిచ్చు తల్లులు శరీర సాధకము అనగా గృహకృత్యపు పనులు చేసికొనుచుండుట, మంచి వాయువులో తిరుగుచుండుట ముఖ్యముగా చేయుచుండవలెను. అటుల చేయుటచే స్తన్యము ఆరోగ్యముగా నుండును. కూరుచున్న చోటనుండి కదలని స్త్రీలకు శరీరారోగ్యము ఉండనేరదు సరేకద తమకును తమ శిశువులకునుకూడ దౌర్బల్యము రోగము సంభవించును. అట్లని విశేషముగా శరీరాయాసముగల పనులు చేయుమని నా తాత్పర్యము కాదు. తాను పుచ్చుకొనిన పదార్థము అనుకూలముగా జీర్ణము కాదగిన పనులు చేసిన మేలని నా అభిప్రాయము. పని చేసి అలసినప్పుడు శిశువునకు స్తన్యమియ్యకూడదు. కొంచెము బాగుగా నున్న తరువాత నియ్యవచ్చును విశేషించి యెండలో కూరుచుండి కాని తిరుగుచుండి కాని యుండకూడదు.

రాత్రిభాగమున పరుండియు, పగటిభాగమున కూరుచుండియు స్తన్యమియ్యవలెనుగాని సగము కూరుచుండియు సగము పరుండి వంకరగానుండియు స్తన్యమియ్యకూడదు. అందువలన నడుమునకు బలక్షీణమగును.

చిత్తవృత్తి— మనస్సు విచారయుక్తముగా గాని పట్టజాలని సంతోషముతో గాని యుంచకూడదు. నిర్విచార సంతోషయుక్తముగా నుంచవలెను. ఎందువలననగా మనస్సుయొక్క స్థితినిబట్టి స్తన్యముయొక్క స్థితి మారుట విధాయకము. విశేషకోప, కుత్సిత విచారాదిభావములుగల స్త్రీల స్తన్యము పుచ్చుకొను శిశువుల యొక్క మనస్సులు కూడ నాలాగుననే అయినట్లు అనేకస్థలములలో కనిపెట్టియున్నారు. జఠరస్థితినిబట్టి మనస్థితియుండును. దృఢజఠరము శరీరమునకు ఆరోగ్యమును సంతోషమును గలుగజేయును. అట్టి జఠర దార్ఢ్యము నిర్విచారమనస్కులయి యున్నవారికిగాని యుండదు. సదా విచారయుక్తమయినవానికి అజీర్ణరోగము కలిగియుండును. కాబట్టి రెండులకును నిర్విచారమయిన మనస్సు అత్యంతాపేక్షణీయము.

స్తన్యమిచ్చు కాలములో బహిష్ఠగుట— స్తన్యమిచ్చు కాలములో బహిష్ఠ అయినయెడల పృథక్శయ్య చేయవలెను. గర్భోత్పత్తి అయినయెడల శిశువునకు స్తన్య

మియ్యగూడకపోవుటయే కాక, ఆవ్యవధిగ మరల గర్భోత్పత్తియగుయు శరీరము మిగుల దుర్బలమయినదగును. స్తన్యమిచ్చు కాలములో బహిష్ఠయిన రోజుల స్తన్యము మరింత మధురముగను నిర్మలముగను బలము చేయునదిగను ఉండునని కొందరి అభిప్రాయము యున్నదిగాని అది కేవలము పొరబాటు. బహిష్ఠయిన రోజుల పైగుణములన్నియును వ్యతిరేక లక్షణముగలవయి యుండును. బహిష్ఠగుచున్న పాలదాయిలను ఆకారణముపట్టి కుదుర్చుకొనగూడదు.

కొన్ని బాధలు—స్తనాగ్రములు కొందరు స్త్రీలు రవికలను అతిబిగించి తొడుగుకొనుటవలన స్తన్యము క్రమముగా ఊరుటకు అభ్యంతరము కలుగుటయే కాక స్తనాగ్రములలోనికి పోవుట తటస్థమగును.

శిశువునకు సర్వదా స్తన్యమిచ్చువాడుకచేత స్తనాగ్రములు చీముపట్టును. శిశువునకు నోరుపూత మొదలయినవి కలిగినందువలనను స్తనాగ్రములు చీముపట్టును. ఇందుకు ఔషధము మున్నజగురు ఒకటౌన్సు పటికపొడుము ౫ గ్రేనులు రెండును బాగుగా కలిపి రెండు వ్రేళ్ళతో తీసినంత ఒక్కొక పర్యాయము తీసికొని స్తనాగ్రములకు పట్టించుచురావలెను. స్తనాగ్రములు పగిలినరోజుల బ్రాందిగాని నవనీతముగాని రాయవలెను. స్తన్యము విశేషముగానుండి కారిపోవుచున్నరోజుల స్తనాగ్రములకు గాజుటోపీలవంటివి అమ్ముచుండును అవి పెట్టుకొనవలెను. చీము పట్టినప్పుడుగాని పగిలినప్పుడుగాని ఆటువంటివేడుంచి శిశువునకు పాలియ్యవచ్చును.

రొమ్ము—రొమ్మున పాలున్నప్పుడుగాని స్తన్యమియ్యగూడదు. స్తన్యమున్నను శిశువుత్రాగనిరోజుల అది యే కారణమువలననో తెలుసుకొనవలెను. రొమ్ములు సలుపుగానున్నరోజుల ఉప్పుకలాము మర్దనా చేయవలెను. బాల్యమందు అతిరాజసముగా పెరిగిన స్త్రీలకు రొమ్ములు జవుకుగానుండును. స్తనాగ్రములు పయికి కనబడవే కనబడవు. అటువంటి వారికి ప్రథమప్రసవములో మొదటినెలలో చాలబాధగానుండును. శిశువులు స్తన్యము పుచ్చుకోజాలరు. ఇది చిన్నతనములో గట్టి రవికలు తొడుగుకొనుటవలన కలుగును. అందువలన ఆభాగములు క్రమముగా వృద్ధిపొందక అణగిపోవును. మరియు క్రమముగా పనిపాటలు చేసికొనుచు శరీరము ఆరోగ్యముగా నుంచుకొనకపోవుటవలనను కూడ రొమ్ములు వృద్ధిపొందవు. పాటుపడు స్త్రీలకు బహుఅనుకూలముగనుండుటయే యిందుకు దృష్టాంతము.

జవుకురొమ్ములు రెండువిధములు. ౧ లోపలనుండి జబ్బచ్చినవియు ౨ పయిన మాత్రము వాచినట్లుండునవియు:—స్తన్యమిచ్చునపుడు రొమ్ములపయిని బట్ట యుంచకపోవుటవలనను కూరుచుండి యిచ్చుటవలనను రొమ్ములు జవుకురొమ్ము

లగును. స్తనాగ్రములు ఒరసినందువలనగూడ జవుకురొమ్ములగును. స్తనాగ్రములు పయికి బాగుగావ్యాపించక సమమట్టముగ నున్నందునను, కొందరికి సమమట్టము కంటెలోని కున్నందువలనను రొమ్ములు జవుకిచ్చును. ఇట్లు స్తనాగ్రములు పయికి వ్యాపించకపోవుటకు కారణము బాల్యమున రవికలు బిగించితొడుగుకొనుటవలననే యని పైని వ్రాసియుంటిని. జవుకురొమ్ములుగలవారికి శిశువులకు స్తన్యమియ్యజాలక పోవు దురవస్థమాత్రమే కాక స్తన్యము రొమ్ములయందే యుండి సలుపు మొదలగు బాధలను కలుగ జేయుచుండును.

రొమ్మున పాలులేనప్పుడు శిశువులకు స్తన్యమిచ్చు దురభ్యాసమువలనగూడ జవుకు రొమ్ములగును. ఇదియే ముఖ్యకారణమని కూడ కొందరనిరి.

పైని చెప్పిన రెండువిధములయిన జవుకు రొమ్ములలోను పయిభాగమును మాత్రము వాచినవాటివిషయములో స్తన్యమిచ్చుటకు అభ్యంతరములేదు. లోపల నుండి జబ్బిచ్చినయెడల ఏరొమ్ము జబ్బిచ్చునో ఆరొమ్మున సుతరామూ స్తన్యమియ్య గూడదు. రొమ్ములు జబ్బిచ్చునపుడు జ్వరమువచ్చును. రొమ్ములు పెద్దవగును. వేడిగాను సలుపుగా నుండును; నీరసముగా నుండును; ఆకలితగ్గును; దాహ మెచ్చును. ఇందుకు చికిత్సచేయుచున్నను జరుగునెడల జబ్బుకనపడిన నాలుగు జాములలోగా జరుగవలెను. లేనియెడల ఆజబ్బుకుదరదు. ఆబాధ చెప్పదరముగాక యుండును. తరువాత ప్రసవములలోకూడ లోపలనుండియు జబ్బిచ్చినరొమ్ములను శిశువునకు స్తన్యమియ్యగూడదు. ఆవిషయములో బాగుగా తెలిసిన వైద్యుని నడిగి, ఆతడు స్తన్యమియ్యవచ్చుననిన నియ్యవచ్చును. కొందరికి స్తన్య మిచ్చుటవలననే బాధయును రాకుండ శిశువులకేమి తమకేమి సుఖముగానుండుటయు గలదు. అది ఆయాస్త్రీలయొక్క తత్వభేదములనుబట్టియుండును.

స్తన్యమిచ్చు స్త్రీలు స్తన్యమిచ్చినవెనుక తమకు నీరసముగానున్నట్లు తోచిన యెడల వెంటనే యేదైనఫలహారము చేయవలయును. అట్టిస్థితిలో శిశువునకు కేవల స్తన్యమే కాకుండ నితర ఆహారమేదయిన నిచ్చుచుండవలెను. ఇతర ఆహార మిచ్చు చున్నను నీరసముగానున్నయెడల ఆశిశువునకు స్తన్యమిచ్చుటయే మానవలయును.

స్తన్యమిచ్చుకాలములో స్త్రీలు విరేచనముల కౌషధము పుచ్చుకొనరాదు. తప్పక పుచ్చుకొనవలసినయెడల ఆముదము పుచ్చుకొనినమేలు. ఎనిమా సాధన మునుపయోగించినయెడల జీర్ణకోశములకేవిధమైనతొందర కలుగకయే విరేచనము లగును. అందువలన మాతాశిశువులకేమియును జబ్బుచేయనేరదు. తరుచుగా మల బద్ధముగా నున్నయెడల ఆహారపదార్థములమూలముననే విరేచనమగు సాధనము

చేయవలయును గాని ప్రత్యేకించి విరేచనౌషధములు పుచ్చుకొనుచుండ గూడదు. కొందరికి తేనె పుచ్చుకొనినయెడల విరేచనమగును. అట్లయిన యెడల నౌషధమునకు బదులుగా తేనె పుచ్చుకొనుట మంచిది. ప్రాతఃకాలేచి దంతధావనము చేసికొనిన వెంటనే చల్లని యూటజలము దాహము పుచ్చుకొనినంత మాత్రమువలనే చాలమందికి విరేచనమగును. జఠ్యమును చేయును. పిల్లవాండ్రకును మందపిత్తేవిరేచన కారియగు నౌషధము.

స్తన్యమిచ్చు తల్లులు బలుహారపదార్థములను గాని ఆవకాయ మొదలగు ఊరుగాయలు మిరపకాయలు ఆవాలు మొదలగు వస్తువులు విశేషముగా చేసిన పచ్చళ్ళను గాని తినగూడదు. పుచ్చుకొనిన యెడల శిశువులకు బాలజబ్బు చేయును.

శిశువులను పాలువిడిపించుట—శిశువులను గర్భమున ౯ నెలలవరకు మోయుట యెట్లో స్తన్యమిచ్చుటయు తొమ్మిది నెలలవరకే యని అనుభవసిద్ధముగా కనిపెట్టబడినది. తొమ్మిది నెలలవరకు తప్పక స్తన్యపానము ఉండవలెను. అప్పుడు స్తన్యపానము లేనియెడల బలము ఎంతమాత్రమును ఉండదు. తొమ్మిది మాసముల పిమ్మట స్తన్యపానము ఉన్న శిశువులకు బలహీనత కలుగునని కొందరి యభిప్రాయమైయున్నది. తొమ్మిది మాసములైన వెంటనే పాలువిడిపించిన బిడ్డలు మిక్కిలి ఆరోగ్యవంతులుగా నున్నట్లు కనిపెట్టబడినది. కొన్ని శీతలదేశములలో ౧౮-౨౦ మాసములవరకు శిశువులకు స్తన్యమిచ్చుచుండుటవలన ఆశిశువులకు జీర్ణశక్తి మొదలయినవి తగ్గి మెదడు చెడిపోవుటయును తల్లులకు చెవుడు గ్రుడ్డి వచ్చుటయు తటస్థించుచున్నవి—శిశువు దుర్బలముగా నున్నపుడు ౧౨ మాసములవరకు స్తన్యమియ్యవచ్చును. తల్లికి శరీరదార్ఢ్యము విశేషముగా లేనియెడల ఆరుమాసములు కాగానే పాలు విడిపించవచ్చును. ౧౨ మాసముల పిమ్మట శిశువులకు స్తన్యమిచ్చుట యీదేశమందుమాత్రము ఆచారముగనేయున్నది. శీతలదేశములలోవలె నిక్కడనగా హిందూ దేశమున రెండుసంవత్సరములు గడచువరకును స్తన్యమిచ్చుచుందురు. అట్లు స్తన్యపానము చేసిన బిడ్డలకు బలహీనత మొదలగు జబ్బులు చేయుటయును లేదు.

పిల్లలను పాలువిడిపించునప్పుడు క్రమక్రమముగా స్తన్యమిచ్చుట తగ్గించి, ఇతర ఆహారము పుచ్చుకొనుట అభ్యసింపజేయవలెను. తుదకు రాత్రిమాత్రమే స్తన్యమిచ్చుట అలవాటు చేసికొనవలెను. స్తన్యము సులభముగా వదలని యెడల పక్కలో పాలసీసా యుంచుకొని స్తన్యమని భ్రమింపజేసి ఆపాలు త్రాగించుచుండవలెను. ఆపాలు సాధ్యమయినంత పలచని గోక్షీరములుగా నుంచవలెను. బాగుగా కాచి కొంచెము చల్లారినవిగా నుండవలెను. పాలు విడిపించవలసియున్నప్పుడు బిడ్డను దగ్గిర

పకుండ బెట్టుకొనుచున్న యెడల అది సాధ్యము కాకపోవచ్చును; కాబట్టి స్తనాగ్రములకు వేపాకువంటి చేదయినను చేదుగానుండునది రాసిన యెడల ఆచేదును ఒకటి రెండు పర్యాయములు చూచి బిడ్డ స్తన్యపానమును మానివేయును.

బిడ్డలను పాలువిడిపించు కాలములో తల్లులు మితముగ భోజనము చేయుచుండవలెను. ఆకాలమేదో తెలిసికొనుటకు కొన్ని నిదర్శనములు గలవు. ఏవనగా స్తన్యమిచ్చునప్పుడు చెవులలో హోరుమనిధ్వని, నేత్రములకు మబ్బు గప్పినట్లుండుట, కనుగ్రుడ్లు నొప్పిగానుండుట, శిరస్సుపోటు పెట్టుట, ఒడలు వణకుట అన్నహితవుతప్పుట గుండెలు కొట్టుకొనుట, అజీర్ణము మలబద్ధము ఎడమపార్శ్వము నొప్పులు తొడలు లాగుకొనిపోవుట. ఈ మొదలగు బాధలు తటస్థించును. ఇందులో నే రెండుమూడు బాధలు కనబడినను తల్లులు స్వయముగా స్తన్యమిచ్చుటమాని శిశువు నీరసముగా నున్నయెడల పాలదాయిచేత నిప్పించవలెను.

స్తన్యమిచ్చుకాలములో అకాత్తుగా స్తన్యము తగ్గిపోయిన యెడల మరల గర్భోత్పత్తి అయినట్లెంచవలెను. ఆసంగతి తెలియగానే ఎడపిల్లను స్తన్యము విడిపించనయినను విడిపించవలెను. దుర్బలముగానున్నయెడల పాలదాయిచేత నిప్పించవలెను. గర్భోత్పత్తి కానియెడల మరల బహిష్ఠగుట ప్రారంభమయినతక్షణమే ఎడబిడ్డలకు స్తన్యమిచ్చుట మానివేయవలెను.

కొందరు స్త్రీలకు పైనిచెప్పిన బాధలు ఏమియును కనబడకుండ స్తన్యమిచ్చుటమాత్రము కష్టముగానుండును. కష్టమనగా రొమ్ములు నొప్పిగా నుండును. ఆనొప్పిలక్ష్యము చేయక స్తన్యమిచ్చిన యెడల రొమ్ములు జవుకిచ్చును.

స్తనాగ్రములు ఒరసి పుండ్లుగానున్నప్పుడు స్తన్యమిచ్చుట మానివేయుటకు గురుతుగా నెంచుకొనవలెను.

ఏ స్త్రీలకు దగ్గుబాధ విశేషముగా నుండునో, ఉమియునప్పుడు రక్తము పడునో గుండెలు తటతట కొట్టుకొనుచుండునో అత్యంతనీరసముగానుండునో ఆస్త్రీలు తమ బిడ్డలకు స్వయముగా స్తన్యమియ్యగూడదు. మంచిపాలదాయిలచేత నిప్పించవలెను. మంచిదనగా పూర్వోత్తరములు తెలిసికొని మంచినడవడిగలదియును ఆరోగ్యము గలదియును సమానవయస్సుగల బిడ్డకు తల్లిగాను ఉన్నదానిని చూచుకొనవలెను.

తల్లికి జ్వరము, మశూచికము మొదలగు అంటుజాడ్యము లేవయినను తటస్థించిన యెడల శిశువును వెంటనే మరియొకయింటికి తీసికొనివెళ్ళి పాలదాయి చేత స్తన్యమిప్పించవలెనుగాని ఆజబ్బుస్థితిలో తల్లియే స్తన్యమిచ్చిన యెడల స్తన్యము విషయుక్తమైయుండునది గావున శిశువు మృతినొందుటకు సందియము లేదు. అయింటనే

శిశువున్నయెడల అంటురోగములు శిశువుకు బహుశీఘ్రముగ సంభవించి అస్వల్ప వయస్సులో ప్రమాదము కలుగ జేయుటకు సందియము లేదు.

గర్భిణిగానున్నప్పుడు శిశువునకు స్తన్యమిచ్చిన యెడల గర్భస్రావమగును. శిశువునకుగూడ జబ్బుచేయును. గనుక అట్టి అవస్థలో శిశువు ఏడాది యీడుగలిగియున్న యెడల పాలువిడిపించవలెను. నీరసముగా నున్న యెడల పాలదాయి చేత స్తన్యమిప్పించవలెను. శిశువునకు స్తన్యమిచ్చుటమానినపిమ్మట మరల యెన్నడును ఇయ్యగూడదు.

సంపూర్ణము.

హుండీ-రామారావు.

సంఘదురాచార సంస్కరణసమాజమును దానియుద్దేశమును.

(౨౭౬ - పుట శేషము.)

శాస్త్రసమ్మతము కాకపోయిన నిట్టివాడుకల కాచారమే బలియమై ముఖ్యమయిన కారణముయినది. ఏకమతమయినచోఁ దమయందుఁగల పలువిధములగు శాఖాభేదములను పాటించక తమలోఁ దాము బహాటముగా వివాహములు చేసికొనుట మిక్కిలి శ్రేయోభివృద్ధిగా నుండును. ఆచారములను జనులు తమ సౌఖ్యముకొఱకెట్లు మార్చుకొనినను మార్చుకొనవచ్చుననియు, మనపూర్వులనేకపర్యాయము లిట్లు మార్చుకొనుచువచ్చినట్టు నిదర్శనములు కనుపించుచున్నవనియు మైన నే చెప్పియున్నాను. శాస్త్రసమ్మతము కాకపోయినచో నాచారమును మార్చుట కొంత వఱకు కష్టతరమేయయినను, శాస్త్రసమ్మతమయినచో వానిని మార్చుకొనుట యెంత సులభసాధ్యమయినది యగునో మీరే యాలోచింపుడు. ఈశాఖాభేదముల వారు వివాహములు చేసికొనఁగూడదని యెచ్చటను, శాస్త్రములయందుగాని శ్రుతిస్మృతులయందుగాని చెప్పఁబడియుండలేదు. ఈయాచారము భేదించుట కిష్టపడని వారు కొందఱు రెండుమూఁడు శ్లోకములను తామే చేసి యెచ్చటివో చెప్పక గ్రంథస్థములని మాత్రము చెప్పుచు, వానివలన నిట్టిమార్పుగూడదని వాదించుచున్నారు. గ్రంథస్థములు గాని యట్టివాక్యముల నెంతమాత్రమును గణింపఁగూడదు.

పూర్వమునందువలె నిప్పుడు నొకచోటినుండి మఱియొకచోటికిఁ బోవుటకు ప్రయాణకష్టములును, ఒకచోటివార్త మఱియొకచోటికి దెలియుట కాలస్యమును అక్కరలేదు. దూరదేశమునందుండి వచ్చి యొకమతమువాఁడు మఱియొక మతము వానినని చెప్పినచో నందలి నిజమును గనుగొనుట కంత ప్రయాసమును ఆలస్యమును అక్కరలేదు. ఇట్లు శాఖాభేదములేక వివాహములు బహాటముగాఁ జేసికొనకపోవుటచేతనే కన్యకలకు యుక్తమయినవరులును, వరులకు యుక్తమయిన కన్యలును సమకూడకున్నారు. శాఖాభేదమును గణించి బహాటముగా వివాహములు చేయకుండుటచేత కన్యాశుల్కములును, వరశుల్కములును పుచ్చుకొనువాడుకలు హెచ్చగుచున్నవి. కలిసి భోజనము చేయుచుండు పలుశాఖలవారు వివాహములు చేసికొనుట వలన నష్టమేమియు నాకు కనుపింపదు.

బ్రాహ్మణులయం దెట్లు పలుశాఖలు కనుపించుచున్నవో యట్లే యితరవర్ణములయందును అనేకశాఖలు కానుపించుచున్నవి. ప్రతివర్ణమువారును తమ వర్ణమునందుగల శాఖలభేదము నెంతమాత్రము తలపక వివాహములు చేసికొనినచో నిప్పటికంటె ప్రతివర్ణమునందును కలిమిడి యెక్కువగా నుండునని చెప్పుట కెవ్వరును శంకింపరు. శాస్త్రప్రమాణములు లేకపోయినను, ఆచారమే యిట్టి దురాచారములకు మూలాధారమయి యనేకములగు నష్టములను దెచ్చుచున్నది. కావున

జాచేసువరులందఱును శాఖాభేదమాత్రమువల్లనే వివాహములు మానుకొనుటవలని నష్టములను బాగుగా గుర్తెఱిఁగి ప్రతివర్ణమునందును శాఖాభేదము లేక వివాహములు చేసికొనునట్లెల్లరను బ్రోత్సాహపఱచి, ఐకమత్యమును గలుగఁజేసి దేశాభిమానులగుదురని కోరుచున్నాను.

దేశక్షేమముకొఱకైన పనిచేయుటకు గాని విద్యాభ్యాసము నిమిత్తముగాని యింగ్లాండు మొదలగు దూరదేశములకు సముద్రయానము చేసివచ్చినవారిని బహిష్కారము చేయుట యుచితమా? కాదా? యను సంశయమును గూర్చి యోచింతము.

దూరదేశయాత్రయు, నివాసమును మనపూర్వుల కంతగా నవసరముండక పోయిన నిప్పుడిప్పుడు మాత్రము మిక్కిలి యవసరముగా గనుపించుచున్నది. దూరదేశములకు సముద్రయానమున పోయినమాత్రముననే కులము చెడునని చెప్పుట యెంతమాత్రము నుచితముగా కనుపించదు. మనవారిలో కొందఱు సముద్ర యానము శాస్త్రసమ్మతము కాదనియు, నింగ్లాండు మొదలగు దేశములు మ్లేచ్ఛదేశములు గాన నట్టిదేశములకు పోవుటయు నచ్చట నివాసము చేయుటయు గూడదనియుఁ జెప్పుచున్నారు. కావున సముద్రయానము శాస్త్రసమ్మతమగునా? కాదా? యను సంశయమును, మ్లేచ్ఛదేశములకుఁ బోయినమాత్రముననే కులము చెడునా? యను సంశయమును జర్చింతము. మ్లేచ్ఛదేశములను గురించి చెప్పుటలో మనువు:—

శ్లో॥ కృష్ణసారస్తు చరతి మృగో యత్ర స్వభావతః।
సజ్ఞేయో యజ్ఞియో దేశో మ్లేచ్ఛదేశ స్త్వతఃపరః॥

అని కృష్ణసారము లెచ్చటపుట్టి మెండుగా సంచరించుచున్నవో యాదేశము యజ్ఞాదికర్మలకుఁ దగినదనియు మ్లేచ్ఛదేశము ఆదేశమునకు పైన నున్నదనియు చెప్పియున్నాడు. మనువు అభిప్రాయమును బట్టి యోచింపగా కృష్ణసారము లుండు దేశములు మ్లేచ్ఛదేశములు కానట్టు తోచుచున్నది. కావున నింగ్లాండు మొదలగు దేశములలో కృష్ణసారములు సంచరించునంతవఱకు మ్లేచ్ఛదేశములు కానట్టు యోచింపవలయును. భరతఖండమునందే కొన్నిదేశములు యజ్ఞాదికర్మలకు తగవని మనువే చెప్పియున్నాడు. మ్లేచ్ఛదేశములలో యజ్ఞాదికర్మలు చేయుట యుచితమైనవి కావని మనువు తాత్పర్యము కాని, వాసయోగ్యములు కావని యెంతమాత్రము కాదు. వర్ణాశ్రమ ధర్మమును విడువక శాస్త్రసమ్మతముగా సంచరించినచో నెందుండినను కులమున కేమియు హాని చేకూరదు. యజ్ఞాదికర్మలకు తగకపోవుట మాత్రముననే యాదేశము నివాసయోగ్యము కాదనియు, నాదేశమునకు పోవుటవలన కులము చెడుననియు చెప్పుట యుచితము కాదు. మఱియు మనుస్మృతియందు:—

శ్లో॥ జటిలంచానధీయానం దుర్బలం కితవం తథా।
యాజయంతి చ యే పూగాం స్తాంశ్చ శ్రాద్ధే న భోజయేత్॥

శ్లో॥ ఆగారదాహీ గరదః కుండాశీ సోమవిక్రయీ।
సముద్రయాయీ వందీ చ తైలికః కూటకారకః॥

శ్లో॥ ఔరభ్రికో మాహిషికః పరపూర్వాపతి స్తథా।
ప్రేతనిర్యాతకశ్చైవ వర్జనీయాః ప్రయత్నతః॥

అని వైద్యులను, జ్యోతిష్కులను, చాల శిష్యులుగలిగిన సన్యాసులను, తండ్రితో పోరాడువారిని, విగ్రహారాధనమున జీవించువారిని, శూద్రులకు విద్యచెప్పువారిని, మద్యపానము చేయువారిని, తమస్నేహితులను నొప్పించువారిని, ఇండ్లను కాల్చువారిని, విషప్రయోగము చేయువారిని, వ్యభిచరించెడు స్త్రీలకు పుట్టినవారిని, సోమవిక్రయము చేయువారిని, సముద్రయానము చేసివచ్చినవారిని, తైలమునమ్ము వారిని శ్రాద్ధమునకు రానియ్యగూడదని చెప్పియున్నాడు. శ్రాద్ధకర్మకు రానియ్యగూడనివారిలో సముద్రయానము చేసినవారినిగూడ చెప్పియున్నాడు. కావున దీనినిబట్టి యోచించగా సముద్రయానము చేసినవారు కర్మలలోనికి రాగూడనివారని కాని బహిష్కారము చేయబడఁదగినవారని కాదు.

సముద్రయానము మనపూర్వులు చేయుచువచ్చినట్లు మన గ్రంథములలో ననేక నిదర్శనములగుపడుచున్నవి. పూర్వము మనదేశమునుండి కొందఱు జావా, సుమత్రా మొదలగు ద్వీపములకుఁ జని యచ్చట దేవాలయములు మొదలగువానిని నిర్మించి, హిందూమతము నాయాస్థలములయందు నెలకొల్పినట్లు శాసనములవలన ననేక నిదర్శనము లగుపడుచున్నవి. పూర్వమునం దెంత సాధారణకృత్యమయిన నిప్పుడుమాత్రము సముద్రయానము మిక్కిలినీచముగాఁ జూడఁబడుచున్నది. రఘువంశమునందు రఘుమహారాజు పారశీకదేశమువరకును వెడలినట్లును అంతవరకు దేశములను జయించినట్లును కనఁబడుచున్నది. అశోకుని రాజ్యమునందుఁ గూడ చీనా మొదలగు దేశములకు యాత్రలుచేసినట్లు ప్రబలనిదర్శనము లగుపడుచున్నవి.

మఱియు ఋగ్వేదమునందు సముద్రయానము మనపూర్వులు తరుచుగా చేయుచువచ్చినట్లు ప్రబలనిదర్శనములున్నవి. మహాభారతమునందు, సహదేవు డనేకములగు మ్లేచ్ఛదేశములను జయించినట్లును, సముద్రయానముచేసి యనేకములైన ద్వీపములు జయించినట్లును చెప్పఁబడియున్నది. కథాసరిత్సాగరములో ఏబదియవ తరంగమునందు చిత్రకారుఁడనువాఁడు కొందఱితో సముద్రమును దాటి ప్రతిష్ఠానపురమునకుఁ బోయినట్లును అచ్చటనుండి సముద్రముపై నెనిమిదిరోజులు ప్రయా

ణము చేసి ముక్తిపురమును జేరి యచ్చట తనశత్రువుల సంపత్తిని జయించి కప్పము గొనినట్లును చెప్పఁబడి యున్నది. మఱియు మనుస్మృతియందు.—

శ్లో॥ సముద్రయానకుశలా దేశకాలార్థదర్శినః।
స్థాపయంతియాం వృద్ధిం సాతత్రాధిగమంప్రతి॥

అని చెప్పియుండుటచేత మనపూర్వకాలమునందు సముద్రయానములు మనపూర్వులు బహుటముగాఁ జేయుచువచ్చినట్లు స్పష్టమగుచున్నది. రాజతరంగిణియను చరిత్రము నందుగూడ సముద్రయానములు సాధారణముగా వాడుకలో నున్నట్లే చెప్పఁబడి యున్నది. కావున కులమునూర్చుకొని యన్యమతావలంబనము చేయక వర్ణాశ్రమ ధర్మములను జాగ్రతగాఁ గాపాడుకొనినచో సముద్రయానమువలన మ్లేచ్ఛదేశము లకు వెడలినమాత్రమున నేమియు నష్టమగుపింపదు. సముద్రయానము చేయక యింటియందే దుష్కార్యములను జేయుచువచ్చినచో కులముచెడక యెంతన్యాయ ముగా ప్రవర్తించినను దూరదేశములకుఁ జనినమాత్రముననే కులము చెడుననుట యెంతమాత్రమును న్యాయము కాదు.

ఇప్పటి కాలస్థితినిబట్టి విద్యాభ్యాసము నిమిత్తమయి దూరదేశములకుఁ బో వలసిన యావశ్యకము మిక్కిలి యెక్కువగా కనుపించుచున్నది. పూర్వకాలము నందువలె సముద్రయాన మెంతమాత్రము కష్టమునుకాదు. అట్లు సముద్రయానము చేసినమాత్రముననే జనులను బహిష్కారము చేసినచో మిక్కిలి క్రూరమైన పని గా నుండును. ఆకార్యములను జేసి రాజదండనమునకుఁ బాత్రులయి శిక్షితులయి అండ మానులు మొదలగు దూరదేశములకుబోయి యదృష్టవశమున మరల వచ్చినవారిని బహిష్కారము చేయక కులములో చేర్చుకొనుచుండుట మన మందరము నెఱిఁగియే యున్నాము. అట్టివారి కవసరములేని బహిష్కారము విద్యాభ్యాసము మొదలగు కార్యములకు దూరదేశములకుఁ బోయివచ్చినవారికే మాత్రము కావలసివచ్చినదా? ఆకార్యములు చేసి శిక్షితుఁడగునవాఁడు కులములోఁ జేరుటకర్హుఁడును, ఏయకా ర్యమును జేయక మంచియుద్దేశముతో దూరదేశమునకుఁ బోయినవాఁ డనర్హుఁడు నని చెప్పుట నాకెంతమాత్రము నుచితముగాఁ దోచుచుండుట లేదు.

దొరతనమునందు గొప్పయుద్యోగములను బొందవలెనన్నను, వాణిజ్యము మొదలగు వ్యాపారము విరివిగాఁ జేయవలెనన్నను దూరదేశములకుఁ బోవుట ప్రకృతమునందత్యంతావశ్యకముగా నగుపడుచున్నది. దూరదేశములకుఁ బోవలసిన యవసరములను గురించి నే నంతగా వ్రాయనగత్యము లేదు. విద్యాగంధమెఱిఁగిన యిప్పటి మనవారందఱు నట్టి యావశ్యకమును బాగుగా గుర్తెఱిఁగియే యున్నారు.

ఎంత రట్టి యగత్యమును గుర్తెఱింగియున్న నెందరట్టి దూరదేశయాత్రల కభిముఖులయి యుండినను బహిష్కారమనెడి క్రూరాచారమును జూచి వెనుకదీయుచున్నారు. దూరదేశయాత్రలం బోఁగూడదని నిర్బంధించుచు వచ్చుటచేతనే మన దేశమున కితర దేశములతో విశేషముగా సంబంధము లేక మన దేశము యొక్కయభివృద్ధి చెడుచున్నది. కావున సముద్రయానము చేసి దూరదేశములకుఁ బోయి వచ్చినమాత్రముననే బహిష్కారము చేయు క్రూరాచారమును మాన్పింపవలయును. అట్టి దేశములయందు నివసించి వచ్చినవారు కులాచారధర్మములను న్యాయముగా ననుష్ఠింపనిచో వారిని బహిష్కారము చేయవలయునే కాని కులాచారధర్మముల నించుకయినను విడువక న్యాయముగా ననుష్ఠించువారిని మాత్ర మట్టిక్రూరాచారమునకు లోఁబడఁజేయుట యెంతమాత్రము ననుచితమని నేను భావింతును.

కులాచారధర్మములను జక్కగా నిర్వర్తింపఁజేయుటకును, అట్టి ధర్మములను విడిచినవారిని శిక్షించుటకును బహిష్కారము చేయు నాచారము మొదటఁ బుట్టినది. స్వదేశమునందే యుండి కులాచారధర్మములను పాటింపకుండెడువారే బహిష్కారమునకు పాలుకావలసిన యగత్యము లేక కులాచారధర్మముల నెంతజాగరూకతతో నిర్వర్తించినను దూరదేశనివాసము చేసినవారు మాత్రమే దురాచారమున కొడఁబడవలసిన యగత్యము గలిగెనా? దేశక్షేమమునకయి రాజకీయ సభలయందు పని చేయుట, విద్యాభ్యాసము చేసి మెప్పుగొందుట, వాణిజ్యము మొదలగు వ్యాపారములను వృద్ధిపఱచుట మొదలయిన మంచియుద్దేశములతో ననేకకష్టముల కోర్చి దూరదేశములకుఁ బోయివచ్చినవారిని బహిష్కారము చేయుట యెంతమాత్రమును న్యాయమని నాచదువరులకు తోఁచునని నేనెంచను. కులాచారధర్మములను విడువవలసిన యావశ్యకము లేక సదుపాయముగా నుండుటకుఁ గొన్ని దేశములయందు ప్రయత్నములు చేయుచున్నారు. సముద్రయానమున సమీపప్రదేశములకుఁ బోయివచ్చినట్లే దూరదేశములకుఁబోవుటకనేకములగు సదుపాయములిప్పుడిప్పుడేర్పడుచున్నవి. కావున, నా చదువరులందఱు నట్టివారిని బహిష్కారము చేయు క్రూరాచారమును మాన్పి, తాము వారి నాదరించి, దేశోపకారమును చేయుదురని నమ్ముచున్నాను.

సంఘదురాచార సంస్కరణ సమాజమువారిచే నాలోచింపఁబడిన యంశము లన్నిటినిగురించి వ్రాసియున్నాను. ఈయాచారములన్నియు నెట్లెట్లు మనయభివృద్ధికి వినాశకారణములుగా నున్నవో వ్రాసియున్నాఁడను. క్రూరాచారములని యెఱింగియు, మనయభివృద్ధికి వినాశహేతువులని తెలిసియు, మన మట్టి దురాచారములకు లోఁబడియుండుట న్యాయముగాదు. చిరకాల స్థాపితములగు నీయాచార

ముల నొక్కసారిగా మానుకొనుట ప్రకృతమునందు కష్టముగాఁ దోఁచినను గొంత కాలమున కట్టి యనాచారములను మానుకొనుటవలని లాభము చక్కఁగా నగుపడక పోనేరదు. చిరకాలస్థాపితములని దురాచారములకు లోఁబడఁగూడదు. వ్యాధి మన శరీరమునం దెంత కాలము నుండి ప్రబలియున్నను చిరకాలమునుండి యున్నదను నభిమాన మించుకయినను లేక మనసౌఖ్యముకొఱకు దానిని పోఁగొట్టుకొను ప్రయత్నమే యెల్లప్పుడును జేయుచుందుము. మనమతము పూర్వమునం దెంతనిర్దుష్టమయిన దైనను ఆయాకాలములయందు పుట్టి ఘనీభవించి యాచరించిన యీదురాచారములవలన దాని యోగ్యత యించుకయినను గనుపింపకున్నది.

స్త్రీపునర్వివాహములు జరుగకుండుటవలన మనకు సంభవించుచున్న నష్టములును, అతిబాల్య వివాహములవలనఁ దటస్థించు హానులును, మునుముందఱను చక్కఁగా గుర్తెఱిఁగియేయున్నాము. ఆచారములు జను లెట్లుమార్చుకొనినను మార్చుకొనవచ్చుననియు, మనపూర్వు లాయాకాలములనుబట్టి వానిని మార్చుకొనిన ట్లనేకనిదర్శనము లగుపడుచున్నవనియు పైనే చెప్పియున్నాను. ధర్మానుష్ఠానమునందు స్థైర్యముగలిగి దేశక్షేమమునకయి పనిచేయువు డాను చేయు కార్యము న్యాయమయినదని యెఱింగియుండిన వానికిఁగలుగు నానంద మెవ్వరికి నుండ నేరదు. మన యభివృద్ధికొఱకును జనక్షేమమునకును చేయు కార్యములు నింద్యము లెట్లగును? అట్టి దేశాభిమానులకు దైవమాత్రము తోడుపడకుండునా? క్రూరాచారములకు పాలయి పతితరానిబాధలను పడుచు మతగురువులనుని బయలువెడలి దుర్నీతులు చెప్పు నిక్కట్టులకు లోనయియుండువారి నైదటిని మన మెఱిఁగియున్నాము. స్వాతంత్ర్య మించుకయినను లేక యిట్టి దురాచారముల పాలు చేయుటచేతనే మన మతమునందుఁగూడ ననేకులకు నమ్మకము పోవుచున్నది. వినాశహేతుభూతములును, అభివృద్ధికి విఘ్నప్రాయములునగు నీక్రూరాచారములను మనము మాన్పుకొని సదాచారములను నెలకొలుపుకొనకపోయినచో నెవ్వరీ కార్యమును పూనుకొందురు? మృగాదులవలె మనుష్యుఁ డభివృద్ధి లేనివాఁడు కాఁడని చెప్పియేయున్నాను. జ్ఞానశూన్యములగు పశువులవలెనే మనమును అభివృద్ధినొంద నేరనిచో మనుష్యుల మనియు, జంతుకోటియందు నుత్కృష్టమయిన వారలమనియుఁ జెప్పుకొనుటకు మన మెట్లు తగుదుము? మనుష్యునకు జ్ఞానము వృద్ధియైనకొలఁది నభివృద్ధి నొందవలయునను వాంఛగూడ నెక్కువగుచుండుట స్వాభావికధర్మము. ఈ దురాచారములవలన గలుగు నష్టములు పూర్ణముగాఁ దెలిసినను అట్టి యనాచారములను మానుకొనుటకు ధైర్యముమాత్ర మిప్పటికిని మనవారికిఁ గలుగలేదు. సంఘములుగాఁ గూడి యీ

దురాచారములను మాన్పఁ బ్రయత్నించినచో నతిసులభముగా శీఘ్రకాలములోననే యవి అడఁగిపోవును. ఒంటరిగా నీక్రూరాచారములను మాన్పి సదాచారములను నెలకొలుపఁ బ్రయత్నించినచో మొదట కష్టములనేకములు గానుపించును. తాను చేయుచుండిన కార్య మెంత న్యాయమైనదయినను, తా నెంతనిర్మలమయినబుద్ధితోఁ గార్యమును జేయుచుండినను జనులుమాత్రము మొట్టమొదట దూషింపకమానరు. చిరకాలస్థాపితములగు నీదురాచారములయందు జనులకుఁగల మూఢవిశ్వాసమును బట్టి మొదట వారి కట్టిమార్పులు కష్టముగాఁ దోఁచినను, కొంతకాలమునకయిన నట్టి మార్పులవలని లాభములు వారికిఁ దెలియకపోనేరవు.

కావున నాచదువరులందఱును జనులకు మనమతమునందుఁగల దురాచారములను అందువలనఁ గలుగు నష్టములును జక్కఁగా దెలియఁబఱచి యట్టివానిని మార్చుకొనుటవలనఁ గలుగులాభములను బోధించి, క్రూరాచారముల నడఁగఁద్రొక్కి సదాచారములను నెలకొలుపఁ బ్రయత్నింతురని నమ్ముచున్నాను. సంఘదురాచార సంస్కారణసమాజమువా రాలోచించిన పైనవ్రాసిన యంశములన్నియు శాస్త్రసమ్మతములయిన మార్పులేయని చెప్పుటకు సాధారణములగు నిదర్శనములను గొన్నిటిని పయిన వ్రాసియున్నాను. ఈయంశములను గురించి శ్రద్ధవహించి పనిచేయుటకు దేశాభిమానుల నందఱిని మరిమరి కోరి నేనింతటితో విరమించుచున్నాఁడను.

సంపూర్ణము.

కొ. రా. వేం. కృష్ణారావు.

సూర్యశతకము. (౫౮౭-పుట శేషము.)

స్ర॥ గ్రావన్‌లోలోఽపిలోకాం స్త్రమపక్వృతి కృతావాస్థితః స్థైర్యకోటిం
స్వాంతానాం వృష్టిం విజహ్మం విదధ దధికరోత్యంత రత్యంతభద్రామ్।
ఉస్త్రాపస్యాపి హేతుర్భవతి నియమినామేక నిర్వాణదాయీ।
భూయాత్స ప్రాగవస్థాధిక తరపరిణామోదయోఽర్కః శ్రియైవః॥ ౨౬॥

మ॥ చలుఁదున్లోక పరిభ్రమంబున, నచాంచల్యంబు దద్రత్న; లో ।
కులదృక్కృద్ధియఁ దంచుచు, న్గడుమది న్గానృన్న వృష్టిన్; జని ।
స్థలము న్దప్తికి, నిత్యనిర్వృతియుఁ నా దానేతఁడో, ప్రాగ్దశా ।
త్యలఘీయః పరిణామ భూముఁడిడు నయ్యర్కుండు మీకున్సిరుల్॥ ౨౬॥

స్ర॥ వ్యాపన్నర్తుర్న కాలో వ్యభిచరతిఫలం నౌషధీ వృష్టిరిష్టా ।
నేష్టైస్సంపద్యంతే దేవా నహి వహతి మరు న్నిర్మలాభానిభాని ।
ఆశాస్స్వాంతా నభిన్నన్త్యవధి ముదధయో విభ్రతి క్ష్మాభృతః క్ష్మాం
యస్మింస్త్రైలోక్య మేవం నచలతి తపతి స్తాత్ససూర్యః శ్రియైవః॥ ౨౭॥

మ॥ బుతువుల్దప్పవు; పైరు లెండవు; వెసగున్వ్రష్టుల్; మఖాశుల్ శుధన్ ।
వెతలంగాంచరు; గాలిచీచుఁ; బృథివి న్భృథ్వీభృత్ప్రభ్రమలోన్మ, న ।
ప్పతులు న్మీఅవుమేర; చుక్కలలర; న్భద్రమ్ము లౌదిక్కు; లి ।
ట్లు తిరమ్మై త్రిజగమ్ము నెల్గనెతఁడా లోకాప్తుఁడేలు న్శ్రియమ్॥ ౨౭॥

స్ర॥ కైలాసే కృత్తివాసా విహరతి విరహ త్రాసదేహార్ధకాంతః ।
క్రాంతశ్నోతే మహాహే వధిజలధివినా ధర్మనాపద్మనాభః ।
యోగోఽర్ధ్యోగైకతానో గమయతి సకలం వాసరం స్వం స్వయంభూ ।
ర్భూరి త్రైలోక్య చింతాభృతి భువన విభౌ యత్ర భాస్వాన్సనోవ్యాత్॥ ౨౮॥

మ॥ రజతాద్రిం గజకృత్తివాసుఁడు విహారంబారఁ జేయున్ప్రియో ।
గజభీతిం దనమేనఁ దాననిడి; నాగస్వామిపై శ్రాంతిఁబం ।

---

౨౬. సుదృష్టిన్=మంచి జ్ఞానమును. తప్తికి=తాపమునకు. నిత్యనిర్వృతి (నిత్యానందము) ముక్తి. ప్రాగ్దశా...భూముఁడు. ఉపాసనారంభమునఁ దోఁచు లోకములు తిరుగుటకుఁ గన్నులు చెదరఁగొట్టుటకుఁ దాపమునకును హేతువగు బాహ్యరూపముకంటె మిక్కిలి గొప్పతరమైన, తిరముగ జనుల రక్షించి మంచిజ్ఞానమునిచ్చి ముక్తిగలిగించు నాంతర బ్రహ్మరూపముగలవాఁడు.

౨౭. మఖాశులు=(క్రతుభుజులు) దేవతలు. అప్పతులు=సముద్రములు.

౨౮. గజకృత్తివాసుఁడు=(ఏనుఁగు రక్కసితోలు, పుట్టముగలవాఁడు.) శివుఁడు దానన్=పార్వతిని.

కజనాభుండను పరుండనుమాయనిడి; యోగంబెల్ల బ్రొద్దుంగరో ।
జజుఁడుంబూను; నెతంచు ద్రోవజగ; మూనప్రాభ్వదేల్ల న్నిమ్ముఁడా ॥ ౮౮॥

స్ర॥ ఏతద్యన్మండలంఖేత పతిదిన కృతస్తా ఋచోర్చీంషియాని ।
ద్యోతంతేతాని సామాన్యయమపి పురుషోమంతరేంతర్యజూంషి ।
ఏవంయంవేద వేదత్రితయమయమయంవేదవేదీ సమగ్రో ।
వర్గస్స్వర్గా పవర్గోపకృతిరవికృతి స్సోస్తుసూర్యః శ్రియేవః॥ ౮౯॥

మ॥ ఇనబింబంబెది కల్గువెంటు; నదియాఋక్కుల్; రుచుల్సామముల్; ।
ఘనసణ్వంతర పూరుషుండును యజుస్సంఘంబునా; వేదవి ।
జ్జనమిట్లేని త్రయీమయుం దెలియు; నాస్వర్గాపవర్గ ప్రదుం ।
డనపాయుండిడు బాలసూర్యుఁడు సముద్యచ్ఛ్రీలు మీపాలుగన్ ॥ ౮౯॥

స్ర॥ నాకౌకః ప్రత్యేకక్షతిపటు మహసాం వాసవాగ్రేసరాణాం ।
సర్వేషాం సాధుపాతాం జగతి దమదితే రాత్మజత్వేనమేపి ।
యేనాదిత్యాభిధానం నిరతిశయగుణై రాత్మనిన్యస్తమస్తు ।
స్తుత్య స్త్రైలోక్య వంద్యైస్త్రిదశమునిగణైస్సోస్తు సూర్యః శ్రియేవః॥ ౯౦।

మ॥ దివిషద్వైరి నిరాసిశౌర్యులు జగత్త్రైమూర్త్యకార్యుల్ శతా ।
హవముఖ్యుల్సురలెల్ల నందనుల దిత్యఙ్ఞాస్య; లైనన్ బుధ ।
స్తవనీయ త్రిదశర్షి వందితగుణాప్తఖ్యాతి యత్సంశ్రితం ।
బగునాదిత్యపదంబు తద్రవి శుభప్రారంభముల్మీకిడున్ ॥ ౯౦॥

స్ర॥ భూమింధామ్నో; భివృష్ట్యా జగతిజలమయీం పావనీం సంస్పృతావ ।
హ్యాగ్నేయీందా హకత్వాదహురపి యజమానాత్మికాం ప్రార్థితార్థైః ।
లీనామాకాశఏవా మృతకరఘటితాం ధ్వాంతపక్షస్య పర్వ ।
ణ్యేవం సూర్యోష్టభేదాం భవఇవభవతః పాతుబిభ్రత్స్వమూర్తిమ్॥ ౯౧॥

మ॥ ద్యుతిభూమిన్ భువివృష్టి వారిమయి దాహోచ్ఛక్తి నాగ్నేయి సం ।
స్కృతిచేఁ బావని వైకలిన నసకృత్స్వేష్టార్థి యష్టాత్మ ద ।

---

౮౯. రుచులు=వెలుఁగులు. అణు...పుఁడు=సూక్ష్ముఁడయిన బింబమధ్యమందలి పురుషుఁడు. అపవర్గ=మోక్షము.

౯౦. ఆహవ=యజ్ఞము బుధ...ఖ్యాతిన్=విద్వాంసులచే వర్ణింపఁదగిన, దేవతల చేతను మునులచేతను నుతింపఁదగిన సుగుణములచే నందఁబడిన కీర్తిచే. యత్సంశ్రితంబు=ఏసూర్యునికి ప్రసిద్ధము. తద్రవి=ఆసూర్యుఁడు.

౯౧ ద్యుతిభూమిన్=(కాంతి, కాధారము) భూమియను మూర్తి, వారిమయి=జలరూప. ఆగ్నేయి=అగ్నిరూప, పావని=వాయురూప, దర్శ=అమాస అత్మతనువున్=సూర్యమూర్తి.

ర్ణితిథి ప్రాప్తసుధాంశు వాత్సతనువుర్వ్యుర్వ్యుండు నానష్టధా ।
స్థితి నెట్టున్నదిఁ జూపు సూర్యుఁడు భవత్క్షేమావహుండయ్యెడున్॥ ౯౧॥

స్ర॥ ప్రాక్కాలోన్నిద్రపద్మాకర పరిమిళిత నాభిర్భవత్పాదశోభో ।
భక్త్యా త్యక్తోరుశోకోద్గతి దివివినతా సూనునాప్యాయమానః ।
సప్తాశ్వాప్తాపరాంతాన్యధిక మధరయన్వ్యజగంలిప్తతోలం ।
దేహైర్దేవస్సహాయో దపర ఇవ మురారాతి రహ్నాంపతిర్నః ॥ ౯౨॥

మ॥ బిరుఁడీతండు మురాంతకుండనఁగఁ, బ్రాగ్రిగున్న ప్రపద్మాకరో।
దర సంమేళనశోభిపాదుఁడును సప్తాశ్వాప్త లోకాధరీ।
కరణావర్త్యనుతుండు భక్తిభరముక్తస్వోరుశుక్కాశ్యపి।
త్వరితోన్నితుఁడు వి టు, సూర్యుఁడు భవత్సంరక్షకుండయ్యెడున్॥ ౯౨॥

స్ర॥ యఃస్రష్టాపాంపురస్తాదచలవర సముద్యన్నితస్నైతురేకో
లోకానాం యస్త్రయాణా స్థితి ఉపరిపరం దుర్విలఙ్ఘ్యోన ధామ్నా।
సద్యస్సిద్ధ్యై ప్రసన్నద్యుతిశుభ చతురాశాముఖః స్రాద్విభక్తో
ద్వేధాచేధా ఇవావిష్కృత కమలరుచి స్స్వర్చిహామా కరోవః॥ ౯౩॥

మ॥ అమృతస్రష్ట, పురోచలప్రవరనిత్యోన్నత్యహేతుండు, ద।
ర్గమధామాఖిలకష్టపోహరితలాగ్రస్థాయి యావిష్కృతా।

---

౯౨ పాశ్రీక...పాదుఁడు—సూర్యుఁడు, తూర్పునవికసించిన (పద్మ + ఆకర) తామర కొలకులయొక్క మధ్యభాగముల కలయికచేనొప్పు కిరణముల యందము గల వాఁడు, విష్ణువు, ముందు చేలోకన్న (పద్మా*కర) లక్ష్మియొక్క యెఱ్ఱ చేతుల చేతఁబట్టుటచేఁ బ్రకటమగుచున్న యడుగుల చక్కదనముగలవాఁడు సప్త*అశ్వ—సూ॥ ఏడు గుఱ్ఱములచే, ఆప్త—వ్యాపింపఁ బడిన, సప్త—ఏడయిన అశ—శీఘ్రముగ, ఆప్త—ఆక్రమింపఁబడిన, అధరీ కరణ—సూ॥ వెనుకచేయుట, వి॥ హీనములుగఁ జేయుటచే, స్వ+ఊరుశుల్—సూ॥ తన తొడల దుఃఖము, స్వ+ఉరుశుక్— వి॥ తనగొప్ప శ్రమము. కాశ్యపి—(కశ్యపుని కొడుకు) సూ॥ అనూరుఁడు. వి॥ గరుత్మంతుఁడు.

౯౩॥ అమృతస్రష్ట—(సూర్యుడు) వర్ష జలమును నిర్మించువాఁడు, (బ్రహ్మ మొదట) జలమును సృజించినవాఁడు. పురో...హేతుఁడు—సూ॥ ఉదయగిరి శ్రేష్ఠమునకు నొప్పునను గీర్తినిగలిగించువాఁడు, (బ్ర) మొదటఁగశ్చలమగు గొప్ప పదముచే నౌన్నత్యము గని వైభవమించువాఁడు. ధామ—తేజము, సత్యలోకము, పద్మ=కమలములు, విష్ణునాభికమలము, చతుర=సుందరములగు, ఆశానక్త్రి—దిఙ్ముఖములు, చతుర్=నాలుగు. ఆశా—దిక్కులయందు, వక్త్రి—మొగములు, కలవాఁడు. అన్యాదృశుండు. ఇతరునివలెఁ గనఁబడుచున్న, అమర జ్యేష్ఠుఁడు—బ్రహ్మ.

సమపత్త్ర ద్యుతి స్వస్థ కాంతి చతురాశావక్త్రిఁ దేశాన్యదృక్కుం।
దమరశ్రేష్ఠుండు నాఁగ, ధామనిధి సమ్యక్సిద్ధులన్మీకిడుఁ॥ ౯౩॥

ప్ర॥ సాంద్రీమ్యార్వ్య నదీశాదికతి దశదిశోదర్శయన్ స్వాక్రిగ్ధశోయ
స్సాదృశ్యం దృశ్యతే నో సదశశతదృశి త్రైదశేయస్యదేశే।
దీప్తాంశుర్య స్యభవ్యాద శివయుగదశాదర్శిత త్వాదశాత్వా
శాక్త్యశ్వాః శక్యయస్యాశయవి దతిశయాద్దంద హాశాశనాద్యః॥ ౯౪॥

మ॥ సకలీశ త్రిదశప్రదేశ సదృశాశంసా ప్రశస్యుండు ముఁక।
వశము ల్పెసెడు దర్పణంబున రసావారాశి శైలద్యుమం ।
గ్గిశిల ద్వాదశరూప దర్శితజగత్రీకుండు హాతాశిరా
దశనాశ్వోదుం యుదశ్వశాసియుదు దీప్తాంశుండతండిష్టముల్ ॥ ౯౪॥

ప్ర॥ తీర్థాని వ్యర్థ కానిప్రాహ్లాదనదసరసీ నిర్ఝరాంభోజినీనాం।
తానుబంధిసోదన్వంతోను దంతిప్రతిభయమకరభం శ్వభ్రిపా।
తాంసైవయత్రతివో నాశాఖగాయా అపికలుషముషో మజ్జ।
త్రాతుంయా తీర్థలోకాన్సదిశతుదివసస్సైక హేతుర్హితః వః॥ ౯౫॥

మ॥ ప్రహితముల్నిర్ఝరముల్నబ్జినులు నదీశ్వాప్తార్థ తీర్థంబులో ।
నుదధుల్నారిక పాతహేతు భయదాం హోభంజ నాదక్షముల్ ।
త్రిదశ ద్వీపవతీ జలంబులును స్నాతృశ్వేతనముం జేయవే ।
సదయుండొందు జగంబుఁ బ్రోవజన; నాసప్తాశ్వుఁ డాప్తుండగున్॥ ౯౫॥

ప్ర॥ ఏతత్పాతాళపంకప్లుతమివ తమసాచైక ముగ్ధాధమాసీ ।
దప్రజ్ఞాత ప్రతర్క్యం నిరవగతి తథాలక్షణం సుప్తమంతః ।
యాదృక్సృష్టేః పురస్తాన్నిశి నిశి ఖిలం జాయతే తాదృగేవ ।
త్రైలోక్యం యద్వియోగాదవతు రవిరసౌ సర్గతుల్యోదయో వః॥ ౯౬॥

మ॥ ఇది పాతాళపుటద్దు నన్నుసిఁగిన ట్లే కాంధకారావృతిన్ ।
విదితం బూహ్యము గాక, తెల్వియును భిన్నెల్లేక, లోఁగూర్కి యౌ ।
ట్టిది ప్రాక్సృష్టిఁ, బ్రతిక్షపంబుగను నాకీం త్రిలోకంబు న ।
గ్గదశాభోదయు నేయనుండో అఁగి; దుష్కర్మంబతం డేర్చుఁదున్॥ ౯౬॥

ప్ర॥ ద్వీపే యోఽస్తాచలోఽస్మిన్భవతి ఖలు స ఏవాపరత్రోదయాద్రి ।
ర్యా యామిన్యుజ్జ్వలేందుద్యుతిరిహ దివసోఽన్యత్ర దీప్తాతపస్సా ।
యద్వశ్యౌ దేశకాలా వితినియమయుతో నోఘయం దేశకాలా ।
వవ్యాత్స స్వప్రభుత్వా హితభువనహితో హేతురత్రాహ్నినో వః॥ ౯౭॥

---

౯౪ సమ్యక్+ఆశంసా=సాదృశ్యము యొక్క (వాంఛ) లేమిచే. యదశ్వశాసీ— ఏసూర్యుని సారథి.

౯౫. అబ్జినులు=నదులు కొలఁకులు. తీర్థ=జలము. అంహస్=పాపము. ఊహ్యమ=అను మేయము. ౯౬. క్షప=రాత్రి.

మ॥ అపునీదివినిగ్రుంకు కొంతదెుదదేయతా పొస్సుగట్టొంటనే ।
దళుమేల్వాన్నెల నిండమూపిటనదేయతా మందురేవొందుచో ।
నటత్వంజేఁకి జేశజేశపిటు వశ్యంబుల్నత వ్యక్యుఁడా ।
భువనత్రాణకృతిస్వతంత్రుఁడగు హితంబుల్ కు సూర్యుండిడున్॥౯౬॥
స్ర॥ వ్యస్తైరత్యగ్రహౌఘం గ్రసనగురుభరైరర్క సమస్తైరుదస్తైః ।
ప్రత్యస్తైర్భసమస్తైరుదయగిరిగతో గోగణైర్గౌరయన్గామ్ ।
ఉద్గాఢార్చిర్విలీనామరతగత నగగ్రావగర్భామివాహ్నః ।
మగ్రేయోగ్రే విధత్తేగ్లపయతు గహనం సగ్రహం గ్రామణీర్వః॥౯౭॥
మ॥ అతిభారగ్రసితగ్రహౌగ్ర్యభము ప్రత్యుగ్రంబుదగ్రంబువ్య ।
గ్రతమంబించుక యుగ్రమింతయు సమగ్రంబద్రి, గోవర్గము ।
ద్ధత దీప్త్యావృతసార పూర్ణగిరిత రూపద్యగ్ర్యభయాగోవు సం ।
గతి గౌరంబొనరింప మున్నెడు గ్రహోగ్రస్థాత, యీఁగెడున్॥౯౭॥
స్ర॥ యోనిస్సామ్నాం విధాతా, మధురిపురజితో, ధూర్జటిశ్శంకరోసౌ, ।
మృత్యుఃకాలో, లకాయాః పతిరధిపతయః పావకో జాతవేదాః ।
ఇత్థం సంజ్ఞా దబిద్ధాది వహమృతభుజాం యాయదృచ్ఛా ప్రవృత్తా ।
స్తాసామేవాభిధేయో నగతగుణగణైర్యస్స సూర్యోవతాద్వః॥౯౮॥
మ॥ అజు వేదాదివిధాత, విష్ణుఁడజితుం, డార్యానహోయుంను శంభు ।
భువు, ప్రేతేశుఁడు కాలుఁడర్థపుఁడు శ భుప్నిర్ఘుఁడు, పావకుం ।
డవుదైశ్వానరుఁ, డిట్లు సంజ్ఞలుదబిద్ధామల్పెలె స్వేల్పులం ।
దవు, నన్వర్థము లేనియందినుఁ దతంబైశ్వర్యము ల్మీకిడున్॥౯౮॥
స్ర॥ దేవఃకింబాన్ధవస్స్యాత్ప్రియసుహృదథవాచార్య ఆహోస్విదర్కో
రక్షా చక్షుర్ను దీపో గురురుత జనకో జీవితం బీజమోజః ।
ఏవం నిర్ణీయతేయఃకిమితి నజగతాం సర్వదా సర్వదోసౌ ।
సర్వాకారోపకారీ దిశతు దశశతాభీశురభ్యర్థితం వః॥౧౦౦॥
మ॥ కులదైవంబొ, గురుండొ, తండ్రి, చెలియొక్కొ, యర్యుఁడొ, యాచార్యుఁడో ।
వెలుఁగో చుట్టమొ రక్ష దివ్వె బ్రతుకో బీజంబొ క్షేత్రంబొ చే ।

౯౬. నతద్వ్యక్యుఁడు వానికి (దేశకాలములు) లోఁబడనివాఁడు.

౯౭. అతి...భము=కడుబరువు గలుగ చేయఁబడిన యెదుటి గ్రహములుమిక్కిలిపుగల. ఉగ్ర=చుఱుకుగల. అద్రిన్=ఉదయాచలమున. గోవర్గము=వెలుఁగుల గుమియను నావులమంద. సంగతిన్=వ్యాప్తిచే. గోవున్=భూమియను నావును. గౌరంబు=తెల్లనిదానినిగా. ఈఁగెడున్ = తొలఁగించుఁగాత.

౯౮. దబిద్ధామల్పెలెనవున్= (రూఢములు) ప్రసిద్ధివలనఁ గలిగినవి. అర్థము లేనివి అన్వర్థములు=సార్థకములు. ౧౦౦. అర్యుఁడు=ప్రభువు.

వెలుఁగిల్లెదుని గిర్ణయింపనగు నేవేళన్ సమస్తంబులో ।
కులకెల్లన్ సమకూర్చుఁ గోరికలు మీకున్ స్నేర్పుఁడాతండిడుఁగాన్॥ ౧౦౦॥

స్ర॥ చత్వారింశత్త్రిభాయాస్త్రయ ఇహచ పునర్వాజినాం షట్సహస్రం ।
పశ్చాన్నేతుర్ద్విషట్కం పునరపిచదశ స్యందనస్యైకముక్తం ।
భూయోష్టౌ మండలస్య స్ఫుటమథచరవేర్వింశతి శ్శ్రీమయూరే ।
నిత్యం ప్రాతః పఠేద్యశ్శతక మనుదినం సూర్యసాయుజ్యమేతి॥

మ॥ వెలుఁగుల్నల్వదిమూఁట నాళిటను దర్వీశు, ద్ద్విషట్కమ్మునన్ ।
విలసత్సూతుఁడు పద్నొకండు రథమున్ బింబమ్ము నిర్వాల్గిటన్ ।
నలినాప్తుండట నిర్వదింటఁ జనరన్నాడెంపు నూర్పుద్యముల్ ।
లలితమ్ముల్ పసువన్ మయూరకృతముల్ తెల్పుల్ జిజమ్మం దెడిన్॥

స్ర॥ శ్లోకాన్లోకస్య భూత్యై శతమితి రచితాన్ శ్రీమయూరేణ భక్త్యా ।
యుక్తశ్చైతాన్పఠేద్య స్సకృదపి పురుషస్సర్వపాపైర్విముక్తః ।
ఆరోగ్యం సత్కవిత్వం శ్రియమతులబలం కాంతిమాయుః ప్రకర్షం ।
విద్యామైశ్వర్యమర్థం పరమపిలభతే సోత్ర సూర్యప్రసాదాత్॥

మ॥ పరిపూర్ణాయురరోగతాబల కవిత్వద్యుత్స్వవిద్యారుచుల్ ।
పరమున్గాంచు సకృన్మయూరకృతభాస్వత్స్తోత్రపాఠంబునన్ ।
దురితంబుల్విడి, యన్వహమ్ము భువనంబున్భక్తిచే తత్పరా ।
త్మ్యురుపుణ్యస్మరణంబు సేయు రవిసాయుజ్యస్థితి యాశ్చర్యమే॥

మ॥ భవదుపమానతారుణరభాస్కరవర్ణ్యమయూరసిద్ధకా ।
వ్య పరమనోహరార్థ పరిభావనజాతకుతూహలోల్లస ।
న్నవచపలత్వపూర్ణ ఘనాతనకర్ణసుఖైషితాకృతాం ।
ధరింపృతిపద్య, పద్వనజదాసుఁ, వ్యాసముహిశతత్వమా॥

ఇది, శ్రీమత్కాశీవశుద్రినివాస, వ్యాసలింగేశ్వర, కారుణ్యపా, త్రిశ్వలాయనసూత్రా త్రేయసగోత్ర ప్రతిప్రస్తావ చాటుపద్యపఠనసమధిక సమధిగత సకలాంధ్రనాయక పారితోషిక మహారాష్ట్రినివారణప్రబంధప్రణేతృ వేంకటమనీషి ప్రపౌత్ర చ్ఛాత్రపుస్తక వితేఘుల, తైర్థికాస్తరణ, విభూతి, పురాణపత్ర పత్రావళీవితరణ, సముపజనవాత్సల్య కృతాస్పదమాతులోత్తరపద వ్యాస భట్టారకపౌత్ర నిరుపాధికపాఠనైక కార్యతుపిత సకలకాలతా సత్యాది సుగుణవిశాలతాజనతాభినుత సనామకన్యాపరిణేతృ వేంకటాంతర్యాణిపుత్ర సీతారామాగ్రజానందివంశ్య వ్యాసమూర్తిశాస్త్రాంధ్రీకృతేష్టదేవతార్చిత శ్రీమయూరాభిధాప్రసిద్ధ సంస్కృతమహాకవిప్రణీత సూర్యశతకము సంపూర్ణము. పీఠి = కుట్టిము పద్వనజ = పాదపద్మము. కేశినకురు = కాశీన కురు. అనువాక్యమువలన బుట్టినది.

సంపూర్ణము.

శుద్ధపత్రిక.

పేజి.	పంక్తి.	తప్పు	ఒప్పు.
౧	౨౦	లార్క్యమ	లార్క్యము
౨	౧౦	తిగ్మరో	తిగ్మరోచి
	౧౩	చీకటులవా	యిర్లవలఁబా
	౨౯	ప్రత్యర్థాన	ప్రత్యూర్థాన
౩	౮	ల్లోపమ్ము	ల్లోపమ్ము
	౨౭	చికటి	చీఁకటి
	౧౭	రాయో	రాయో
౪	౨౭	రోచనై	ర్లోచనై
౫	౨	స్పదతులు	స్స్పదతులు
		రో నాం	రోచనాం
	౮	వత్వం	నవత్వం
	౧౦	స్ఫజ్ఞాడకా	స్ఫజ్ఞాకలా
	౨౫-౨౬	నూగన	నూఁగన
౬	౧౦	వినుత	వినుతు
	౧౨	న్కూర్వద్బి	న్కూర్వద్భి
	౧౫	సంబుథు	సంబుధు
౭	౩	ప్రష్టో	ప్రవిష్టో
	౪	సేమ్మి	ద్యుసేమ్మి
	౭	దయు	దయునో
	౨౧	కర్తు	కర్తుం
	౨౭	ఆలోక	ఆలోక
౮	౨	దాశీగా	దాశీగాశా
		పుష్కరాణీ	పుష్కరాణీవ
	౭	ష్ణుపద	విష్ణుపద
	౧౩	యుగ	యుగవి
	౧౬	మీది	మీకది
	౨౨	మంద	మందు
		నభ్యు	నభ్యున్న
౯	౧౫	చ్చిత్రమ	చ్చిత్రము
	౨౦	శ్యాలో	శ్యాలోకి
౧౦	౬	కాశా	కాశావకాశా
	౭	తమము	తమముం

	౧౯	త్న్వానాంబు	త్న్వానాంబుం
	౨౦	హ్నద్దా	హ్నద్దావా
౧౧	౫	క్రుసజ	పురిటిజడ
	౧౧	ప్రత్యర్థితం	ప్రత్యర్థితం
	౧౭	సహింగించు	సహాయించు
	౨౦	ప్రచార	సంప్రచార
౧౨	౬	బూంచు	బూచు
౧౩	౧౧	ద్యతే	పద్యతే
	౨౦	ర్యవంతి	ర్యవంతి
	౩౦	ఐశ్వర్య	ఐశ్వర్య
౧౫	౧౨	క్యుంభ	క్యుంభి
	౧౩	ద్యుతి	ద్యుతిస్సా
	౧౪	చ్యావహా	చ్యావహాంబకౌ
	౨౪	ర్ద్దోష	సర్ద్దోష
	౨౫	ఆకాశము	మేరువు
౧౬	౧౧	పీతాన్య	పీతాన్యదిశాన్న
౧౭	౫	పలుగు	పలుంగురా
	౨౪	లుమేయఘుమ్మలుసమా	లమేమ్మ మేయఘనులు
౧౮	౨	ఖరుచ	ముఖరుచ
౧౯	౧	ద్వృచ్ఛ్రితి	ద్వృచ్ఛ్రితి
౨౧	౧౪	ప్రాప్యకృతి	ప్రాప్యకృతి
౨౨	౯	త్రేప	స్వత్రేప
౨౪	౩	స్థధానో	స్థధానో
	౬	విధేయ	విధేయ
౨౫	౭	లహరుల్యా	లహరుల్యాను
౨౬	౨౨	తనంద గు	తనదగు
౨౭	౧	ర్థూర్థ్వజా	ర్థూర్థ్వజా
	౯	మూతె	మూతి
		సాక్ష్య	సాక్ష్య
	౧౯	చక్రి	చక్రి
౨౮	౧౪	లర్థో	లర్థో
౨౯	౧౩	ల్గాంచు	ల్గాచు
౩౦	౧౭	క్ష్మపదవి	క్ష్మపదవి
౩౧	౪	దరో	దయోవః

,, పలిశెట్టి సూర్యనారాయణ శాస్త్రిగారు, విశాఖపట్ట

,, గద్దె వెంకటావ్రుగారు, వెదమూర్లంక.

,, తాటంకి వెంకటసుబ్బారావుగారు, అమలాపురము.

,, సత్యవోలు కామేశ్వరరావుగారు, కిర్లంపూడి.

,, ద్వారం వేంకటవరసయ్య నాయుడుగారు, విశాఖపట్టణ

,, సెట్రి చెరీ హిందూరీడింగురూము, విశాఖపట్టణము.

,, వెపటి నారాయణమూర్తిగారు, తణుకు.

,, మంగళంపల్లి వీరరాఘవులుగారు, యలమంచిలి.

,, కొండమొదల లింగారెడ్డిగారు, కొండమొదలు.

,, మల్లపూడి ముత్తయ్యగారు, తణుకు.

,, మల్లపూడి వెంకట్రాయుడుగారు, తణుకు.

,, బి. గోపాల అయ్యర్ అవర్‌ఘల్, అమలాపురము.

,, ఆనరెరీ సెకెండరీ రీడింగురూము, జయపూరు.

,, అగస్త్య కృష్ణస్వామిగారు, కడప. ౩- ౦-౦

,, జయంతి లక్ష్మీనరసింహముగారు, కళ్ళికోట. ౦- ౬-౦

,, యస్. వాసుదేవరావుపంతులుగారు, మడిక్కేరా. ౨- ౮-౦

,, యస్. విబ్రహ్మముగారు, శెరంపూరు. ౩- ౦-౦

,, శేషా కృష్ణమూర్తి గారు, అస్కా. ౩- ౦-౦

,, యస్. స్వామిఅయ్యగారు, కుంభకోణము. ౩- ౯-౦

,, యం. వెంకట నరసింహారావు గారు, యలమంచిలి. ౨- ౨-౦

,, గోగులపాటి శ్రీరాములుగారు, విశాఖపట్టణము. ౩- ౦-౦

,, నెక్కంటి సత్తెయ్యగారు, ఆచంట. ౩- ౦-౦

,, మారిపల్లి శేషాచలముగారు, గరికపర్రు. ౨- ౬-౦

,, శేతి వేంకట సోమయాజులు గారు, రాజమండ్రి. ౩- ౦-౦

,, చిత్రపు వేంకటాచలముగారు, డిటో. ౩- ౦-౦

,, వేలూరు వేంకట్రామయ్య గారు, డిటో. ౩- ౦-౦

,, సత్యవోలు లక్ష్మీపతి గారు, డిటో. ౪- ౦-౦

,, అజ్జరపు వీరయ్యగారు, డిటో. ౫- ౦-౦

,, మున్నంగి రామయ్యపంతులు గారు, డిటో. ౩- ౦-౦

,, నాళం కామరాజు గారు, డిటో. ౩- ౦-౦

,, బులుసు వెంకట్రావుగారు, డిటో. ౩- ౦-౦

,, జి. వి. శేషగిరిరావుగారు, శెట్టిపేట. ౧- ౦-౦

,, సోమాల రామస్వామిగారు, ఏలూరు. ౩- ౦-౦

,, కే. దుర్గప్రసాదరావు గారు, నాగపూరు. ౩- ౦-౦
